

**ఓటేయండి.. గెలిపించండి :** ఎంపీ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి జ్యోతుల నెహ్రూను పరిచయం చేస్తున్న చంద్రబాబు

'పది' ఫలితాల్లో బాలికలదే..

# పైచేయి

- రాష్ట్రస్థాయిలో జిల్లాకు 22వ స్థానం
- జిల్లాలో 83.09శాతం ఉత్తీర్ణత

కాకినాడ రూరల్, ఏప్రిల్ 22: పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలను విజయవాడలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ సోమవారం ఉదయం 11 గంటలకు విడుదల చేశారు. కాకినాడ జిల్లాలో ఈ పరీక్షల కు 27,671మంది విద్యార్థులు హాజరుకాగా 22,993మంది ఉత్తీర్ణత సాధించినట్లు డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. వారిలో 10,958మంది బాలురు, 12,035మంది బాలికలు ఉండగా బాలికల ఉత్తీర్ణతశాతం ఎక్కువగా ఉందన్నారు. కాకినాడ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఫలితాలకు సంబంధించిన వివరాలను డీఈవో వెల్లడించారు. ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో జిల్లాకు 22వస్థానం రావడం గమనార్హం. గతేడాది జిల్లాకు ఫలితాల్లో 19వ స్థానం దక్కగా 68.02శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

**● బాలికలదే పైచేయి**

పది ఫలితాల్లో జిల్లాలో బాలికల హవా నడిచింది. ఈ పరీక్షలకు 13,592మంది బాలురు, 14,079మంది బాలికలు హాజరుకాగా 10,958 మంది బాలురు, 12,035మంది బాలికలు ఉతీర్ణతతో ముందుండగా బాలురు 80.62 శాతం, బాలికలు 85.48శాతం ఉత్తీర్ణత సాధించారు.

**● రీ వెరిఫికేషన్‌కు ఇలా దరఖాస్తు చేయాలి**

జిల్లాలో పది పరీక్షల ఫలితాల్లో 4,678మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. వారితోపాటు మార్కులు తక్కువ వచ్చాయని అనుమానం ఉన్నవారు, రీవెరిఫికేషన్‌కో సం దరఖాస్తు చేసుకోవచ్చు. పాసై మార్కులు తక్కువ వచ్చాయని భావించిన, పరీక్ష ఫెయిలైన విద్యార్థులు దరఖాస్తును ఈనెల 23నుంచి 30వతేదీ రాత్రి 11 గంటల లోపు సంబంధిత పాఠశాల హెచ్‌ఎం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని డీఈవో సూచించారు. రీకౌంటింగ్‌కోసం ప్రతి సబ్జెక్టుకు రూ.500, రీవెరిఫికేషన్‌కు రూ.1000 చెల్లించాలి. రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసినవారి మార్కుల ను మళ్లీ ఒకసారి లెక్కిస్తారు. తప్పుగా ఉంటే మార్కుల ను మళ్లీ కలుపుతారు. అదే రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకుంటే స్కానింగ్ చేసిన విద్యార్థి జవాబు పత్రాలు అందిస్తారు. సమావేశంలో ఏసీఈ రాజశేఖర్, డీసీఈబీ వెంకట్రావు, డీవైఈవో డేనియల్‌రాజు పాల్గొన్నారు.

# నేడు పవన్ నామినేషన్

- 7లో

# ఓట్లకు గేలం

- జిల్లాలో మత్స్యకారుల సంక్షేమంపై వైసీపీ ఎన్నికల ప్రేమ
- ఓఎన్జీసీ పరిహారంపై సిద్ధం సభలో సీఎం జగన్ లేని గొప్పలు
- మత్స్యకార జాతిని అవమానించేలా ద్వారంపూడి వ్యాఖ్యలు
- మత్స్యకారుల నిరసనలు, ఆందోళనతో ఓటమి భయం

- 8లో

## తనిఖీ బృందాలు నిష్పక్షపాతంగా కేసులు నమోదు చేయాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 22: ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలు, స్టాటిక్ సర్వేలైన్స వంటి బృందాలు తనిఖీలు చేసి నిష్పక్ష పాతంగా కేసులు నమోదు చేయాలని కలెక్టర్ జె.నివాస్ ఆదేశించారు. కాకినాడలోని జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో తనిఖీ బృందాలకు సోమవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు రూ.17కోట్ల94లక్షల విలువైన మద్యం, నగదు, ఇతర ప్రలోభాల సామాగ్రి సీజ్ చేశామ న్నారు. ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేయకుండా తనిఖీ బృందాలు దాడులు ముమ్మరం చేయాలన్నారు.



**డ్రైవర్ బాబు:** ఏపీ బస్సుకు.. రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు బాబే డ్రైవర్ అంటూ సభ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



**మా గురించి ఆలోచించేది నీవే :** చంద్రబాబు రూ.6 వేల పెన్షన్ హామీకి ఫ్లెక్సీలతో దివ్యాంగుల కృతజ్ఞత



**యువోత్సాహం :** మా భవిష్యత్ నీవే.. మా ఓటు నీకే బాబూ..

**మాకు ఈ జెండానే కావాలి :** టీడీపీ జెండాతో యువత



**పేట..పోటెత్తింది :** జగ్గంపేటలో ఎండలోనూ చంద్రబాబు సభకు కిక్కిరిసిన జనం

# జనచంద్రం

## జగ్గంపేట ప్రజాగళం సభకు పోటెత్తిన జనం

- మండుటెండలోనూ భారీగా జనం
- జనంలో మార్పు వచ్చిందన్న బాబు
- జగ్గంపేట అభివృద్ధి చేస్తామని హామీ
- ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపు
- రాష్ట్రాన్ని కాపాడుకోవాలని హితవు

కాకినాడ (ఆంధ్రజ్యోతి)/ జగ్గంపేట/ జగ్గంపేట రూరల్, ఏప్రిల్ 22 : జగ్గంపేట.. జనసంద్రమైంది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పర్యటనకు జనం పోటెత్తారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా తరలి వచ్చారు. ప్రజాగళం బహిరంగసభకు వచ్చిన చంద్రబాబుకు నీరాజనం పలికారు. భారీఎత్తున హాజరైన ప్రజలను చూసి చంద్రబాబు సైతం ఉబ్బితబ్బిబ్బయ్యారు. ప్రజల ఉత్సాహం చూస్తుంటే మార్పు కనిపిస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు సోమవారం కాకినాడ జిల్లా జగ్గంపేటలో నిర్వహించిన సభలో ప్రసంగించారు. జగ్గంపేట నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. విద్య, వైద్యం, పారి శ్రామికంగా ముందుకు తీసుకెళతామని హామీ ఇచ్చారు. పీపీపీ విధానంలో ప్రభుత్వాసుపత్రుల్లో మరింత మెరుగైన సేవలందిస్తామని చెప్పారు. జగ్గంపేటలో ఓ యువతి తనకు కానుకగా ఇచ్చిన పెన్నును సభలో చంద్రబాబు చూపించారు. సీఎం అయిన వెంటనే ఆ పెన్నుతో డీఎస్సీపై తొలి సంతకం చేయాలని కోరిందని, కచ్చితంగా డీఎస్సీపైనే తొలి సంతకం అని ప్రకటించారు. సభా వేదిక ఎదురుగా ఉన్న ఓ ఐస్‌పార్లర్‌ను ప్రజలకు చూపించిన చంద్రబాబు అందులో కూడా ఐస్‌క్రీం కొంటే డిజిటల్ పేమెంట్లు ఉంటాయని, కానీ జగన్ జే బ్రాండ్ మద్యం కొనుగోలుకు మాత్రం ఇదేదీ లేదని మండిపడ్డారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా జ్యోతుల నెహ్రూ, పార్లమెంట్ అభ్యర్థిగా ఉదయ్ శ్రీనివాస్‌ను గెలిపించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. జ్యోతుల నెహ్రూ పోరాట యోధుడని చంద్రబాబు ఈ సందర్భంగా కొనియాడారు. ఆనాడు పుష్కర వంటి పథకాలను పోరాడి తెచ్చుకున్నారని గుర్తుచేశారు. రాష్ట్రంలో రాక్షస పరిపాలన అంతం కావాలంటే జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి పంపించాలని, ఈరోజు మద్యం, మత్తుపదార్థాలు, గంజాయితో యువత బతుకులను నాశనం చేశాడని చంద్రబాబు ధ్వజమెత్తారు. టీడీపీ అధికారంలోకి రాగానే పెండింగ్‌లో ఉన్న పనులు, చిన్న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుత ఎన్నికలు పార్టీ నేతలు, కార్యకర్తలకు పరీక్షా సమయమని అన్నారు. అందుకే కష్టపడి ప్రతి ఒక్కరు పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రం భయంకర నేరస్థుల చేతుల్లోకి వెళ్లిపోయిందని.. ఇదే కొనసాగితే భవిష్యత్తులో జగ్గంపేటలో తలలు నరికే, నరుక్కునే పరిస్థితులు వస్తాయని హెచ్చరించారు. జగ్గంపేట టీడీపీ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ రాష్ట్రానికే కాదు దేశానికే దశ, దిశ అయినటువంటి వ్యక్తి చంద్రబాబునాయుడన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కలిసి ప్రజోపకరమైన ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఉన్నత విద్యా సౌకర్యాలు కల్పించాలని, వైద్యం ప్రతీ సామాన్యుడికి ఉచితంగా అందించాలని, సాగునీటి ప్రాజెక్టులన్నీ పునరుద్ధరించాలని, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి పరిశ్రమలను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని చంద్రబాబును కోరారు. కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ కాకినాడ పార్లమెంట్ పరిధిలో పరిశ్రమలు ఏర్పాటుచేసి యువతకు ఉపాధి ఉద్యోగావకాశాలు కల్పిస్తానన్నారు. గ్లాసు గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఇక గోకవరం రూట్‌లోని కోడూరి రంగారావు స్థలంలో ప్రత్యేక హెలికాప్టర్‌లో దిగిన చంద్రబాబుకు దారిపొడవునా మహిళా శక్తి, యువగళం, దళితగళం, బీసీ గళం, దివ్యాంగులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం టీడీపీ అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మలబాబు, జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్,బీజేపీ నేత దాట్ల కృష్ణవర్మ, ఇతర నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, పాంద్రంకి రాంబాబు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, సత్తిన దాశివారెడ్డి, చదరం చంటిబాబు, మంగరౌతు రామకృష్ణ, కందుల చిట్టిబాబు, పరిమి బాబు, నీలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### గంట ఆలస్యమైనా..

జగ్గంపేటలో జరిగిన ప్రజాగళం సభకు ఎండను సైతం లెక్కచేయకుండా భారీ సంఖ్యలో జనం తరలివచ్చారు.మధ్యాహ్నం 2.30 గంటలకే జనం సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అయితే చంద్రబాబు మధ్యాహ్నం 3.45 గంటలకు హెలికాప్టర్‌లో జగ్గంపేట హెలిపాడ్‌కు చేరుకున్నారు.చంద్రబాబుకు జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. అక్కడి నుంచి 4 గంటలకు సభా స్థలానికి చేరుకున్నారు. చంద్రబాబును చూడగానే జనం ఉత్సాహంతో సీఎం సీఎం అని నినాదాలు చేశారు. పూర్తిస్థాయిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు.



**నీకు జగన్ దిష్టి పోవాలి :** బాబుకు దిష్టితీస్తున్న మహిళలు

**బాబు రావాలి :** చంద్రబాబు ఫ్లకార్డులతో మహిళలు



**అంతా ఓకేనా :** సభ వద్ద ఏర్పాట్లపై చర్చిస్తున్న జ్యోతుల నవీన్



**దారులన్నీ బంద్ :** జగ్గంపేట ఫ్లయ్ ఓవర్ పక్కనా జనం



**మేమంతా టీడీపీ వెంటే :** జగ్గంపేట సభలో నినాదాలు చేస్తున్న తెలుగు మహిళలు



**టీడీపీ కావాలి :** ప్రజాగళం సభా ప్రాంగణంలో చిందేస్తున్న యువతరం

# జిల్లాలో 18 నామినేషన్లు దాఖలు

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 22: జిల్లాలో సోమవారం 18 నామినేషన్లు దాఖలయ్యాయి. కాకినాడ లోక్‌సభస్థానానికి కాకి నాడకు చెందిన పసుపులేటి ఎస్వీఎస్ భూషణం, గోకవరం మండలానికి చెందిన జనపరెడ్డి వెంకటరమణ, కిర్లంపూడి మండలం పాలెం గ్రామానికి చెందిన బొడ్డేటి అప్పారావు స్వతంత్ర అభ్యర్థులుగా, జైభీమ్‌రావ్ భారత్ పార్టీ అభ్యర్థిగా ఏనుగుపల్లి కృష్ణ నామినేషన్లు దాఖలు చేశారు.

ఏడు శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి.. తుని అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా యనమల దివ్య మూడుసెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ప్రత్తిపాడు అసెంబ్లీ స్థానానికి సీపీఐ తరపున ఏగుపాటి అర్జునరావు నామినేషన్ వేశారు. పిఠాపురం అసెంబ్లీకి వైసీపీ అభ్యర్థిగా వంగాగీత రెండుసెట్లు, జైభీమ్‌రావ్ భారత్ పార్టీ తరపున జగ్గారపు మల్లికార్జున నామినేషన్ వేశారు. కాకినాడ రూరల్ వైసీపీ అభ్యర్థిగా కురసాల కన్నబాబు నామినేషన్ సమర్పించారు. పెద్దాపురం అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా నిమ్మకాయల చినరాజప్ప రెండుసెట్లు, నిమ్మకాయల రంగనాగ్ ఒక సెట్ నామినేషన్‌లను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. స్వతంత్ర అభ్యర్థిగా మోటుపల్లి శివకుమార్, జైభీమ్‌రావ్ భారత్ పార్టీ తరపున బుంగా సత్యనారాయణ నామినేషన్లు వేశారు. కాకినాడ సిటీ అసెంబ్లీ స్థానానికి వైసీపీఅభ్యర్థిగా ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, ద్వారంపూడి మహాలక్ష్మి నామినేషన్లు దాఖలు చేశారు. తెలుగు నవగర్జన పార్టీ తరపున కాట్రు నాగబాబు, స్వతంత్ర అభ్యర్థిగా మడికి ప్రభాకరరావు నామినేషన్లు వేశారు. జగ్గంపేట అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా జ్యోతుల నవీన్ నామినేషన్ దాఖలు చేశారు.



పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో రిటర్నింగ్ ఆఫీసర్‌కు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న కూటమి అభ్యర్థి చినరాజప్ప



జ్యోతుల నెహ్రూ, చినరాజప్పలకు బీఫారంలు అందించిన బాబు

## నెహ్రూ, రాజప్పలకు బీఫారంలు

జగ్గంపేట, ఏప్రిల్ 22: జగ్గంపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ, పెద్దాపురం నియోజకవర్గ కూటమి అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప మంగళవారం టీడీపీ అధినేత చంద్రబాబు నుంచి బీఫారంలు అందుకున్నారు. జగ్గంపేటలో ప్రజాగళం ముగింపు తర్వాత హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న బాబు వారికి బీఫారంలు అందించారు. ఎన్నికల్లో అత్యధికమెజార్టీతో గెలవాలని ఆయన ఆశీర్వదించారు.

# వైసీపీ నామినేషన్ ర్యాలీతో ప్రజలకు అవస్థలు

- ట్రాఫిక్‌జామ్‌తో వాహనదారుల ఇక్కట్లు
- మద్యంషాపుల వద్ద వైసీపీ కార్యకర్తల హల్‌చల్



పిఠాపురం మద్యం షాపు వద్ద హల్‌చల్ చేస్తున్న వైసీపీ కార్యకర్తలు

పిఠాపురం, ఏప్రిల్ 22: పిఠాపురం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ సోమవారం తన నామినేషన్ దాఖలు చేశారు. భర్త కాశీవిశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబులతో కలిసి కార్యాలయం నుంచి ర్యాలీగా తరలివచ్చి మండల పరిషత్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, జేసీ రాంసుందరరెడ్డికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ర్యాలీలో కాకినాడ వైసీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ పాల్గొన్నారు. కాగా ర్యాలీ కారణంగా పిఠాపురం పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పట్టారు. ర్యాలీ నిర్వహణ సరిగా లేకపోవడం, ఎక్కడికక్కడ బైక్‌లు, కారులు నిలిపివేయడంతో ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వాహనదారులు నానా అగచాట్లు పడ్డారు. ర్యాలీ కారణంగా ఆర్టీసీ బస్సులను బైపాస్‌రోడ్డు మీదుగా మళ్లించడంతో ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు. కాగా ర్యాలీకి వచ్చిన కార్యకర్తలు మద్యంషాపుల వద్ద హల్‌చల్ చేశారు. వీరిని తీసుకువచ్చిన వారు మద్యం కొనుగోలు చేసి కార్యకర్తలకు ఇవ్వడం కనిపించింది.



## దయచూడు వెంకన్న..

ఆత్రేయపురం, ఏప్రిల్ 22: నామినేషన్ల పర్వం ఊపందుకోవడంతో వాడపల్లి వెంకన్న దర్శనానికి వస్తున్న అభ్యర్థుల సంఖ్య పెరుగుతోంది. ఎమ్మెల్యే అభ్యర్థులు వెంకన్నను దర్శించుకుని ఆశీస్సులు ఇవ్వమని కోరుతున్నారు. నామినేషన్ పత్రాలకు పూజ చేయిస్తున్నారు.

## గెలిచేది మాత్రం ఇంటిపేరేనట..!

### తాత, మనుమరాలి మధ్య పోటీ



ప్రత్తిపాడు, ఏప్రిల్ 22: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో వరుపుల ఇంటి పేరుతో ఇద్దరు ప్రధాన పార్టీల నుంచి పోటీ పడుతున్నారు. టీడీపీ నుంచి వరుపుల సత్యప్రభ, వైసీపీ నుంచి వరుపుల సుబ్బారావు రంగంలో ఉన్నారు. వీరిద్దరూ సమీప బంధువులు..ప్రస్తుతం రాజకీయ ప్రత్యర్థులు కూడా.. అయితే ఇక్కడ కూటమి అభ్యర్థి గెలిచినా, వైసీపీ అభ్యర్థి గెలిచినా 'వరుపుల' ఇంటి పేరుతో ఉన్నవారే ఎమ్మెల్యే అవుతారు. తాత, మనుమరాళ్ల ఈ పోటీలో ఎవరు గెలిచినా, గెలవకపోయిన ఇంటిపేరు 'వరుపుల' మాత్రం తప్పక గెలుస్తుందన్న మాట..

# ఓట్లకు గేలం



## ప్రేమ పుట్టుకొచ్చింది..

కాకినాడ జిల్లాలో మత్స్యకారుల సంక్షేమంపై వైసీపీకి కొత్తగా ఎన్నికల ప్రేమ పుట్టుకొచ్చింది. అసలే తీవ్ర ప్రజా వ్యతిరేకతతో ఓటమి బాటలో ఉన్న అధికార పార్టీ మత్స్యకారులను మచ్చిక చేసుకునేందుకు పన్నాగం పన్నుతుండడం విమర్శలకు దారితీస్తోంది. కాకినాడ తీరంలో ఓఎన్జీసీ, జీఎస్పీసీ తదితర కంపెనీల చమురు తవ్వకాలు, గ్యాస్ తరలింపు కారణంగా వేట తగ్గిపోయి నష్టపోతున్న మత్స్యకారులను ఆదుకోవాలని కాకినాడ సిటీ, రూరల్, పిఠాపురం, తుని నియోజకవర్గాల పరిధిలో మత్స్యకారులు ఎప్పటినుంచో ఆందోళన చేస్తున్నారు. అయినా ఏనాడు వైసీపీ ఎమ్మెల్యేలు పట్టించుకోలేదు. తీరా ఇప్పుడు ఎన్నికలు రావడంతో మత్స్యకారుల ఓట్లపై వైసీపీ గేలం వేసింది. వారందరికి న్యాయం చేసేలా చొరవ చూపుతున్నట్లు సీఎం జగన్ కాకినాడ సిద్ధం సభలో కొత్త డ్రామాకు తెరలేపారు. అసలు ఇంతవరకు మత్స్యకారుల పరిహారంపై నోరెత్తని వైసీపీ ఎమ్మెల్యేలు ఇప్పుడు కొత్తగా దీనిపై తామే ఆందోళన చేస్తున్నట్లు ప్రచారం చేసుకోవడంపై మత్స్యకార సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇటీవల కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే కొండబాబును ఉద్దేశించి మత్స్యకారుల జాతిని అవమానించేలా ద్వారంపూడి వ్యాఖ్యలు చేశారు. ఇది తీవ్ర దుమారం రేపింది. ఈ వ్యవహారం తనకు ఎన్నికల్లో తీవ్రనష్టం చేస్తుందన్న భయంతో అప్పటికప్పుడు మత్స్యకారుల పరిహారంపై వైసీపీ పెద్దల ద్వారా ద్వారంపూడి రాజకీయం చేస్తుండడం విశేషం.

- జిల్లాలో మత్స్యకారుల సంక్షేమంపై వైసీపీ ఎన్నికల ప్రేమ
- ఓఎన్జీసీ పరిహారంపై సిద్ధం సభలో సీఎం జగన్ లేని గొప్పలు
- పరిహారం వచ్చేలా చేయడానికి ప్రయత్నిస్తున్నామంటూ అబద్ధాలు
- అధికారంలో ఉన్న అయిదేళ్లలో పరిహారం ఊసెత్తని ఎమ్మెల్యే ద్వారంపూడి
- ఇటీవల మత్స్యకారుల జాతిని అవమానించేలా ద్వారంపూడి వ్యాఖ్యలు
- జిల్లాలో మత్స్యకారుల నిరసనలు, ఆందోళన హోరుతో ఓటమి భయం
- నష్ట నివారణ కోసం ఓఎన్జీసీ పరిహారం ప్రతిపాదన తెరపైకి
- ఇన్నేళ్లు గాలికి వదిలేసి ఎన్నికల ముందు పరిహారం డ్రామాలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

## ఇప్పుడు హడావుడి

కాకినాడ తీర ప్రాంతంలో ఓఎన్జీసీ, రిలయెన్స్, జీఎస్పీసీ తదితర చమురు సంస్థలు గ్యాస్ నిక్షేపాలు వెలికితీస్తున్నాయి. ఇందుకోసం డ్రిల్లింగ్ చేపట్టడం, గ్యాస్ తరలింపు కోసం పైపులైన్లు, సముద్రంలో గొట్టాలు వంటివి నిర్మించారు. దీని వలన సముద్రంలో వేటకు వెళ్తున్న మత్స్యకారుల వలలు తెగిపోవడం, వేట తగ్గిపోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీంతో వీరి పోరాటాల ఫలితంగా ఆయా కంపెనీలు ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని మత్స్యకారులకు నెలకు రూ.11,500 చొప్పున పరిహారం చెల్లిస్తున్నాయి. అయితే ఇదే పరిహారం కాకినాడసిటీ, కాకినాడ రూరల్, పిఠాపురం, తుని నియోజకవర్గాల పరిధిలో మత్స్యకారులకు మంజూరు చేయించాలని 46 వేలకు పైగా కుటుంబాలు కోరుతున్నాయి. తామంతా అదే ప్రాంతంలో వేటకు వెళ్లి నష్టపోతున్నామని వాదిస్తున్నాయి. కానీ ఈ అయిదేళ్లలో వీరి ఆందోళనను ఏనాడు వైసీపీ ఎమ్మెల్యేలు పట్టించుకోలేదు. ఎన్నికల ముందు మాత్రం ఎమ్మెల్యే ద్వారంపూడి ఎడాపెడా హామీలు ఇచ్చేశారు. పరిహారం వచ్చేలా చేస్తానన్నారు. కానీ గెలిచిన తర్వాత దాని ఊసేమర్చిపోయారు. అయితే దీనిపై కాకినాడ సిటీ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే కొండబాబు పోరాడుతున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని 22 వేల మంది మత్స్యకారులకు చమురు కంపెనీల నుంచి పరిహారం కింద అయిదేళ్లలో రూ.784 కోట్లు వచ్చిందని వాస్తవాలు వివరిస్తున్నారు. కానీ కాకినాడసిటీ పరిధిలోని 35 వేల మంది మత్స్యకారులకు ఓఎన్జీసీ, ఇతర చమురు కంపెనీల నుంచి రూ.వెయ్యి కోట్ల వరకు రావలసి ఉన్నా రాలేదని, ఆ నిధులు ఏమయ్యాయని ద్వారంపూడిని ఇటీవల ప్రశ్నించారు. దీంతో కొండబాబును ఉద్దేశించి మత్స్యకార జాతిని అవమానించేలా ఇటీవల ద్వారంపూడి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో కాకినాడ సిటీ నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా ద్వారంపూడి వ్యాఖ్యలపై తీవ్ర సెగ రేగింది. దీంతో ఎన్నికల్లో తనకు ఓట్లు పోయినట్లేనని ద్వారంపూడి ఆందోళన చెందారు. మత్స్యకారుల ఓట్లు పూర్తిగా రాకుండా పోతాయనే భయంతో కొత్త ఎన్నికల వ్యూహానికి పదునుపెట్టారు. అయిదేళ్ల నుంచీ పట్టించుకోని మత్స్యకారులకు పరిహారం అంశాన్ని కొత్తగా తెరపైకి తెచ్చారు. వారందరికీ పరిహారం ఇప్పించేందుకు పోరాటం మొదలుపెట్టినట్లు కొత్తగా కలరింగ్ ఇచ్చారు.



## దివ్యాంగులకు పవన్ పలకరింపు

గొల్లప్రోలు, ఏప్రిల్ 22: 'అయిదేళ్ల వైసీపీ పాలనలో మా గురించి ఎవ్వరు పట్టించుకోలేదు. మా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది' అని దివ్యాంగులు మొగలి కనకలక్ష్మి, ఉలవకాయల శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. గొల్లప్రోలు పట్టణ శివారులోని హెలిప్యాడ్ వద్ద సోమవారం సాయంత్రం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వస్తున్నారనే విషయం తెలుసుకున్న వారు అక్కడకు ట్రైసైకిల్‌పై వచ్చారు. వారిని గమనించిన పవన్‌కల్యాణ్ దివ్యాంగుల వద్దకు చేరుకుని వారితో మాట్లాడారు.వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వికలాంగుల ఉద్యోగాల ఖాళీలకు సంబంధించి బ్యాక్‌ల్యాగ్ పోస్టులను భర్తీ చేయలేదని, సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని వారు తెలిపారు. దీనిపై పవన్ స్పందిస్తూ వికలాంగులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారికి భరోసా కల్పించే విధంగా నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఇప్పుడే గుర్తొచ్చారా..?



కాకినాడ తీర ప్రాంతంలో ఓఎన్జీసీ, రిలయెన్స్, జీఎస్పీసీ తదితర చమురు సంస్థలు గ్యాస్ నిక్షేపాలు వెలికితీస్తున్నాయి. ఇందుకోసం డ్రిల్లింగ్ చేపట్టడం, గ్యాస్ తరలింపు కోసం పైపులైన్లు, సముద్రంలో గొట్టాలు వంటివి నిర్మించారు. దీని వలన సముద్రంలో వేటకు వెళ్తున్న మత్స్యకారుల వలలు తెగిపోవడం, వేట తగ్గిపోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీంతో వీరి పోరాటాల ఫలితంగా ఆయా కంపెనీలు ము మ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని మత్స్యకారులకు నెలకు రూ.11,500 చొప్పున పరిహారం చెల్లిస్తున్నాయి. అయితే ఇదే పరిహారం కాకినాడసిటీ, కాకినాడ రూరల్, పిఠాపురం, తుని నియోజకవర్గాల పరిధిలో మత్స్యకారులకు మంజూరు చేయించాలని 46 వేలకు పైగా కుటుంబాలు కోరుతున్నాయి. తామంతా అదే ప్రాంతంలో వేటకు వెళ్లి నష్టపోతున్నామని వాదిస్తున్నాయి. కానీ ఈ అయిదేళ్లలో వీరి ఆందోళనను ఏనాడు వైసీపీ ఎమ్మెల్యేలు పట్టించుకోలేదు. ఎన్నికల





ముందు మాత్రం ఎమ్మెల్యే ద్వారంపూడి ఎడాపెడా హామీలు ఇచ్చేశారు. పరిహారం వచ్చేలా చేస్తానన్నారు. కానీ గెలిచిన తర్వాత దాని ఊసేమర్చిపోయారు. అయితే దీనిపై కాకినాడ సిటీ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే కొండబాబు పోరాడుతున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని 22 వేల మంది మత్స్యకారులకు చమురు కంపెనీల నుంచి పరిహారం కింద అయిదేళ్లలో రూ.784 కోట్లు వచ్చిందని వాస్తవాలు వివరిస్తున్నారు. కానీ కాకినాడసిటీ పరిధిలోని 35 వేల మంది మత్స్యకారులకు ఓఎన్జీసీ, ఇతర చమురు కంపెనీల నుంచి రూ.వెయ్యి కోట్ల వరకు రావలసి ఉన్నా రాలేదని, ఆ నిధులు ఏమయ్యాయని ద్వారంపూడిని ఇటీవల ప్రశ్నించారు. దీంతో కొండబాబును ఉద్దేశించి మత్స్యకార జాతిని అవమానించేలా ఇటీవల ద్వారంపూడి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో కాకినాడ సిటీ నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా ద్వారంపూడి వ్యాఖ్యలపై తీవ్ర సెగ రేగింది. దీంతో ఎన్నికల్లో తనకు ఓట్లు పోయినట్లేనని ద్వారంపూడి ఆందోళన చెందారు. మత్స్యకారుల ఓట్లు పూర్తిగా రాకుండా పోతాయనే భయంతో కొత్త ఎన్నికల వ్యూహానికి పదునుపెట్టారు. అయిదేళ్ల నుంచీ పట్టించుకోని మత్స్యకారులకు పరిహారం అంశాన్ని కొత్తగా తెరపైకి తెచ్చారు. వారందరికీ పరిహారం ఇప్పించేందుకు పోరాటం మొదలుపెట్టినట్లు కొత్తగా కలరింగ్ ఇచ్చారు.



పురందేశ్వరికి కేక్ తినిపిస్తున్న ఆమె భర్త దగ్గుబాటి వెంకటేశ్వరరావు

## పురందేశ్వరి జన్మదిన వేడుక

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 22 : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంట్ కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి జన్మదిన వేడుక సోమవారం రాజమహేంద్రవరంలో ఘనంగా నిర్వహించారు. వేకువజామునే వేద పండితులు పురందేశ్వరికి ఆశీర్వచనాలు అందజేశారు. కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు జరిగాయి. కుటుంబ సభ్యులు, బీజేపీ నేతలు, అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# పిఠాపురం విలక్షణం

## విభిన్న తీర్పులు

నియోజకవర్గ చరిత్ర



విలక్షణమైన విభిన్న తీర్పులు ఇస్తూ రాష్ట్రంలో ఎల్లప్పుడు పిఠాపురం నియోజకవర్గం తన ప్రత్యేకతను చాటుకుంటుంది. సెంటిమెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే ఓటర్లు, తమను పట్టించుకోని నేతల పట్ల అదే రీతిలో తమ ఓటు ద్వారా షాక్‌లు ఇస్తూ ఉంటారు. దేశంలో ప్రసిద్ధి గాంచిన అనేక పుణ్యక్షేత్రాలకు పుట్టినిల్లు ఈ ప్రాంతం. ఎందరో కళాకారులు, సాహితీవేత్తలకు జన్మనిచ్చిన ప్రాంతంగా ప్రసిద్ధిగాంచిన పిఠాపురం మెట్ట, మైదాన, సముద్రతీర ప్రాంతాల మేళవింపుగా ఉంది







## సర్వమతాల మేళవింపు..

స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వాములు, ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరీ దేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో దశమశక్తి పీఠానికి అధిష్టాన దేవతయిన పురుహుతికా అమ్మవారు కొలువై ఉన్న పాదగయ క్షేత్రం, దేశంలోని పంచమాధవ క్షేత్రాల్లో ఒక్కటిగా విరాజిల్లుతున్న కుంతీమాధవస్వామి దేవస్థానం, శ్రీపాదశ్రీవల్లభుని జన్మక్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం ఇక్కడే కొలువై ఉన్నాయి. శతాబ్దం పైగా చరిత్ర కలిగిన ఆంధ్రా బాప్టిస్టు సెంటినరీ చర్చి, దేశంలోని ఎందరో ప్రముఖులకు జన్మనిచ్చిన క్రిస్టియన్ మెడికల్ సెంటర్ ఇక్కడ ఉన్నాయి. మతాలకు అతీతంగా ఆధ్యాత్మిక బోధన చేసే విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఇక్కడే కొలువై ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన జాంధాని చీరలకు ప్రసిద్ధిగాంచిన ఉప్పాడ గ్రామం, ముస్లింలు అతి పవిత్రంగా భావించే కొత్తపల్లి మండలంలోని పొన్నాడలో గల బషీర్‌బీబీ దర్గా ఇదే నియోజకవర్గంలో ఉంది.

## సెంటిమెంట్‌కు ప్రాధాన్యం

పిఠాపురం నియోజకవర్గ ఓటర్లు సెంటిమెంట్‌కు ప్రాధాన్యమిస్తారు. నియోజకవర్గం ఏర్పడిన వెంటనే సీపీఐ అభ్యర్థిని గెలిపించగా తదనంతరం జరిగిన రెండు ఎన్నికల్లో ప్రజాపార్టీని గెలిపించారు. 1999 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పొత్తులో భాగంగా సీటు బీజేపీకి కేటాయించింది. బీజేపీ అభ్యర్థిగా పెండెం దొరబాబు పోటీ చేయగా టిక్కెట్టు ఆశించి భంగపడ్డ సంగిశెట్టి వీరభద్రరావు ఇండిపెండెంట్‌గా నిలబడ్డారు. కాటికి పంపుతారో..అసెంబ్లీకి పంపుతారో మీ ఇష్టం..ఇవే నా చివరి ఎన్నికలు అంటూ చేసిన ప్రచారం సెంటిమెంట్‌గా మారి ఓట్ల వర్షం కురిపించింది. ఆ ఎన్నికల్లో సంగిశెట్టి విజయం సాధించారు. 2004 ఎన్నికల్లో తిరిగి బీజేపీ అభ్యర్థిగా పెండెం దొరబాబు పోటీ చేశారు. కాంగ్రెస్ గాలిని ఎదురొడ్డి విజేతగా నిలిచారు. 2009లలో అనూహ్యంగా ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా తెరపైకి వచ్చిన వంగా గీతావిశ్వనాథ్ స్వల్ప మెజార్టీతో గట్టెక్కారు. అప్పుడు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ముద్రగడ పద్మనాభం మూడో స్థానంలో నిలవడం గమనార్హం. ఈ ఎన్నికల్లో స్వల్ప తేడాతో పరాజయం పాలయిన ఎస్వీఎస్ఎన్ వర్మకు 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ టిక్కెట్టు నిరాకరించింది. పార్టీ తనకు అన్యాయం చేసిందని ఆయన సాగించిన ప్రచారంతో ఓట్ల వర్షం కురిపించింది. రాష్ట్రంలోనే రికార్డుస్థాయి మెజార్టీతో ఈ ఎన్నికల్లో విజయదుందుభి మోగించారు. అప్పుడు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన పోతుల విశ్వంకు డిపాజిట్లు లభించలేదు. 2019 ఎన్నికల్లో మాత్రం రాష్ట్రంలో వీచిన గాలికి అనుగుణంగానే వైసీపీకి పట్టం కట్టారు.

| సంవత్సరం | విజేత | ప్రత్యర్థి |
|---|---|---|
| 1952 | ఆర్.వి.జగ్గారావు(సీపీఐ) | ఆర్.ఏ. రావు(కాంగ్రెస్) |
| 1955 | వాడ్రేవు గోపాలకృష్ణ(ప్రజాపార్టీ) | కె.బి.రాజు(కాంగ్రెస్) |
| 1960 | పేకేటి తమ్మిరాజు(ప్రజాపార్టీ) | టి.ఎస్.మూర్తి(కాంగ్రెస్) |
| 1962 | రావు బావన్నరావు(కాంగ్రెస్) | పేకేటి తమ్మిరాజు(ఇండిపెండెంట్) |
| 1967 | యాళ్ల సూర్యనారాయణమూర్తి(కాంగ్రెస్) | పేకేటి తమ్మిరాజు(ఇండి) |
| 1972 | యాళ్ల సూర్యనారాయణమూర్తి(కాంగ్రెస్) | కేవీకే రావు(సీపీఐ) |
| 1978 | కొప్పన మోహనరావు(కాంగ్రెస్) | పేకేటి తమ్మిరాజు(జనతా) |
| 1983 | వెన్నా నాగేశ్వరరావు(తెలుగుదేశం) | కొప్పన మోహనరావు(కాంగ్రెస్) |
| 1985 | వెన్నా నాగేశ్వరరావు(తెలుగుదేశం) | సంగిశెట్టి వీరభద్రరావు(కాంగ్రెస్) |
| 1989 | కొప్పన మోహనరావు(కాంగ్రెస్) | వెన్నా నాగేశ్వరరావు(తెలుగుదేశం) |
| 1994 | వెన్నా నాగేశ్వరరావు(తెలుగుదేశం) | సంగిశెట్టి వీరభద్రరావు(కాంగ్రెస్) |
| 1999 | సంగిశెట్టి వీరభద్రరావు(ఇండి) | పెండెం దొరబాబు(బీజేపీ) |
| 2004 | పెండెం దొరబాబు(బీజేపీ) | కొప్పన మోహనరావు(కాంగ్రెస్) |
| 2009 | వంగా గీతావిశ్వనాథ్(ప్రజారాజ్యం) | ఎస్వీఎస్ఎన్ వర్మ(తెలుగుదేశం) |
| 2014 | ఎస్వీఎస్ఎన్ వర్మ(ఇండిపెండెంట్) | పెండెం దొరబాబు(వైసీపీ) |
| 2019 | పెండెం దొరబాబు(వైసీపీ) | ఎస్వీఎస్ఎన్ వర్మ (తెలుగుదేశం) |


ఆర్‌వీ జగ్గారావు


వాడ్రేవు గోపాలకృష్ణ


పేకేటి తమ్మిరాజు


రావు భావన్నరావు


యాళ్ల సూర్య నారాయణ


కొప్పన మోహనరావు


వెన్నా నాగేశ్వరరావు


సంగిశెట్టి వీరభద్రరావు


పెండెం దొరబాబు


వంగా గీతావిశ్వనాథ్


ఎస్వీఎస్ఎన్ వర్మ

### 1952లో ఆవిర్భావం

1952లో పిఠాపురం నియోజకవర్గం ఏర్పాటయింది. 2009లో నియోజకవర్గ పునర్విభజన అనంతరం పిఠాపురం నియోజకవర్గంలో ప్రస్తుతం పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లోని గ్రామాలు ఉన్నాయి. ఇప్పటి వరకూ నియోజకవర్గంలో ఒక ఉప ఎన్నికతో సహా 16 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇక్కడ అయిదుసార్లు కాంగ్రెస్ పార్టీ, మూడు సార్లు తెలుగుదేశం పార్టీ, రెండుసార్లు ప్రజా పార్టీ అభ్యర్థులు విజయం సాధించగా, బీజేపీ, ప్రజారాజ్యం, సీపీఐ, వైసీపీ ఒక్కొక్కసారి, ఇండిపెండెంట్ అభ్యర్థులు రెండు సార్లు విజయం సాధించారు. నియోజకవర్గం నుంచి నెగ్గిన శాసనసభ్యుల్లో కొప్పన మోహనరావు ఒక్కరే మంత్రిగా, కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేశారు.

● (పిఠాపురం)



సముద్రపు కోత

## సమస్యలు ఇవీ..

ఉప్పాడ సముద్ర తీర ప్రాంతం కోత నివారణకు శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది. సముద్రపు కోత కారణంగా కొత్తపల్లి మండలంలోని తీర ప్రాంతంలో వందలాది గృహాలు ఇప్పటికే సముద్రగర్భంలో కలిసిపోయాయి. తీరప్రాంత రహదారి తరచూ కోతకు గురై రాకపోకలు నిలిచిపోతున్నాయి. కాకినాడ సెజ్ కోసం 15 సంవత్సరాల క్రితమే 10వేల ఎకరాలకు పైగా భూములు సేకరించినా ఇప్పటి వరకూ పరిశ్రమలు ఏర్పాటు దిశగా అడుగులు పడలేదు. నియోజకవర్గంలో ఒక్క పరిశ్రమ లేకపోవడం లోటుగా ఉంది. మరోవైపు తీర ప్రాంతంలో కాలుష్యాన్ని కలిగించే బల్క్‌డ్రగ్ పరిశ్రమలు ఏర్పాటు ప్రయత్నాలు మత్స్యకారుల్లో అందోళన నింపుతున్నది. పిఠాపురంలో శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలు శిథిలావస్థకు చేరినా, వాటిని పునర్నిర్మించే ప్రయత్నాలు జరగలేదు. ఉప్పాడ రైల్వేగేటు వద్ద ఆర్వోబీ నిర్మించాలన్నది దీర్ఘకాల డిమాండ్‌గా ఉంది. మరోవైపు ఏలేరు, సుద్దగడ్డ వరద ముంపుతో నియోజకవర్గమంతా తీవ్రంగా నష్టపోతున్నది. ఏలేరు ఆధునికీకరణ పనులు ముందుకు సాగడం లేదు. ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణకు సంబంధించి రూ.147కోట్లును టీడీపీ హయాంలో మంజూరు చేసినా వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడంతో పనులు నిలిచిపోయాయి. అదే విధంగా 55శాతం పూర్తయిన ఏలేరు ఆధునికీకరణ మొదటి విడత పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు.


నామినేషన్ వేయడానికి ర్యాలీగా వెళుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి చినరాజప్ప


రామచంద్రపురంలో నామినేషన్ వేయడానికి వెళుతున్న వాసంశెట్టి సుభాష్


మండపేటలో వేగుళ్ల, హారీష్‌లకు హారతి ఇస్తున్న దృశ్యం



సర్పవరంలో నామినేషన్ వేస్తున్న కాకినాడరూరల్ వైసీపీ అభ్యర్థి కురసాల కన్నబాబు


రాజమహేంద్రవరంలో నామినేషన్ దాఖలు చేస్తున్న మార్గాని భరత్ రామ్


నామినేషన్ పత్రాలను అందజేస్తున్న కూటమి అభ్యర్థి బలరామకృష్ణ

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టంలో నాలుగో రోజైన సోమవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మొత్తం 64 నామినేషన్లు దాఖలయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు 22 మంది నామినేషన్లు దాఖలు చేశారని జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. కాకినాడ జిల్లాలోని కాకినాడ లోక్‌సభ స్థానానికి నలుగురు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 14 మంది నామినేషన్లు దాఖలు చేశారు. తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం లోక్‌సభకు 4, అసెంబ్లీలకు 20 నామినేషన్లు దాఖలైనట్టు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత తెలిపారు.

# అట్టహాసంగా నామినేషన్లు

● వేలాదిగా తరలివచ్చిన ఉమ్మడి కూటమి పార్టీ శ్రేణులు ● భారీ బైక్ ర్యాలీలతో నాయకుల ఊరేగింపు

### చినరాజప్ప నామినేషన్

పెద్దాపురం, ఏప్రిల్ 22: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సోమవారం తన నామినేషన్‌ను దాఖలు చేశారు. అచ్చంపేటలో ఆయన కార్యకర్తలతో భారీ ర్యాలీగా బయలుదేరి పెద్దాపురం ఆర్డీవో కార్యాలయానికి చేరుకు న్నారు. తన అనుచరులతో కలిసి నామినేషన్ వేసేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లారు. ఉదయం 11.59 నిమిషాలకు ఆయన ఆర్డీవో కార్యాలయంలో తన నామినేషన్‌ను దాఖలు చేశారు. ముహూర్త సమయంలో ఆయన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.సీతారామారావుకు నామినేషన్ పత్రాలను అందజేశారు. అలాగే మరో సెట్టు నామినేషన్‌ను చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్ దాఖలు చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు), మాజీ మున్సిపల్ చైర్మన్ రాజాసూరిబాబు రాజు, బండారు సాగర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జైబీమ్‌రావ్ భారత్ పార్టీ తరుపున బుంగా సత్యనారా యణ నామినేషన్‌ను దాఖలు చేశారు. మరో స్వతంత్ర అభ్యర్థిగా మోటుపల్లి శివకుమార్ నామినేషన్ దాఖలు చేశారు.

### యనమల దివ్య నామినేషన్

తుని రూరల్, ఏప్రిల్ 22: తుని నుంచి కూటమి ఉమ్మడి అభ్యర్థిగా పోటీలో ఉన్న శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు కుమార్తె యనమల దివ్య సోమవారం నామినేషన్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. తొలుత తేటగుంట శివాలయంలో పూజలు ఆచరించి అనంతరం తేటగుంట టీడీపీ కార్యాలయంలో ఆత్మీయులు, బంధువులు, పార్టీ శ్రేణులు మధ్య శుభ ముహూర్తాన నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం భారీ ర్యాలీగా తేటగుంట నుంచి తుని తహసీల్దార్ కార్యాలయానికి బయల్దేరారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల నుంచి వేలాదిగా కూటమి ఉమ్మడి పార్టీల కార్యకర్తలు హాజరయ్యారు. తుని పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించగా ఆర్వో కార్యాలయంలో నామినేషన్ పత్రాలను నియోజకవర్గ ఎన్నికల అధికారి రామలక్ష్మికి నామినేషన్ పత్రం అందజేశారు. దివ్య అభ్యర్థిత్వాన్ని కుసుమంచి శోభారాణి, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజులు ప్రతిపాదించారు.

### ఎమ్మెల్యే కన్నబాబు నామినేషన్

సర్పవరంజంక్షన్, ఏప్రిల్ 22: కాకినాడ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సోమవారం ఆర్భాటంగా నామినేషన్ దాఖలు చేశారు. వైద్యనగర్‌లో నివాసం నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులతో ర్యాలీగా సర్పవరం జంక్షన్ వద్ద నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్దకు చేరుకుని రెండు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఇట్ల కిషోర్‌కు అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఎంపీపీ గోపిశెట్టి పద్మజబాబ్జి, స్టేట్ సివిల్ సప్లయిస్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ జంగా గగారిన్, పార్టీ నాయకులు బెజవాడ సత్యనారాయణ, పుల్ల చందూ, పుల్ల కోటేశ్వరరావు, రాందేవు సీతయ్యదొర, తర్లంపూడి నాని, పాలిక నరసింహమూర్తి పాల్గొన్నారు.

### టీడీపీ అభ్యర్థి సుభాష్ నామినేషన్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 22: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ సోమవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుధాసాగర్‌కు ఒక సెట్ నామినేషన్ అందజేశారు. సుభాష్ భార్య లక్ష్మీసునీత కూడా టీడీపీ అభ్యర్థిగా ఒకసెట్ నామినేషన్ దాఖలు చేశారు. సుభాష్ వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్ఆర్‌కే గోపాల్‌బాబు ఉన్నారు. తొలుత ద్రాక్షారామ భీమేశ్వ రాలయంలో పూజలు నిర్వహించారు.

### కూటమి అభ్యర్థి బత్తుల నామినేషన్

రాజానగరం, ఏప్రిల్ 22: రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గం కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈమేరకు నామినేషన్ పత్రాలను రాజానగరంలో ఆర్వో ఎ.చైత్రవర్షిణికి అందజేశారు. అలాగే ఆయన సతీమణి బత్తుల వెంకటలక్ష్మి మరో సెట్టు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

### వేగుళ్ల నామినేషన్ దాఖలు

మండపేట, ఏప్రిల్ 22: మండపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు సోమవారం రెండు సెట్ల నామినేషన్ పత్రాలను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డీ.వీ.వీ ఎల్లారావుకు అందజేశారు. వేగుళ్ల అల్లుడు వి.సాయికు మార్‌బాబు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. వేగుళ్ల నామినేషన్ కార్యక్రమానికి కూటమి శ్రేణులు భారీగా తరలివ చ్చారు. ఏడిద రోడ్డులో ఉన్న కళ్యాణ రైస్‌మిల్లు నుంచి పార్టీ శ్రేణులు, అభి మానులు, నాయకులతో భారీ బైక్ ర్యాలీతో వేగుళ్ల బయలుదేరారు. ఎమ్మెల్యే వేగుళ్ల వెంట టీడీపీ, జనసేన, బీజేపీ, నాయకులు వేగుళ్ల లీలాకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ వీ.వీ.వీ చౌదరి, కోనా సత్యనారాయణ, కోటిపల్లి సాయిరాం, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి తదితరులు వున్నారు.


తునిలో ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న యనమల దివ్య

### రాజమహేంద్రవరంలో నాలుగు నామినేషన్లు దాఖలు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 22: రాజమహేంద్రవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి టీడీపీ ఆదిరెడ్డి శ్రీనివాస్ తరపున రెండో సెట్ నామినేషన్‌ను ఆయన తల్లి ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు దాఖలు చేశారు. వైసీపీ నుంచి ఎంపీ అభ్యర్థిగా గూడూరి శ్రీనివాసు, ఎమ్మెల్యే అభ్యర్థిగా మార్గాని భరత్‌రామ్, ఆయన తండ్రి మార్గాని నాగేశ్వరరావు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బోడా వెంకట్ ఒక సెట్ నామినేషన్, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ నుంచి ఎంపీ అభ్యర్థిగా మేడా శ్రీనివాసు నామినేషన్ పత్రాలను ఆర్వో దినేష్‌కుమార్‌కు అందించారు. ఈనెల 25వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ దాఖలు ప్రక్రియ కొనసాగుతుందని ఆర్వో తెలిపారు.


రాజమహేంద్రవరంలో ఆర్వో దినేష్‌కుమార్‌కు నామినేషన్ అందజేస్తున్న చేస్తున్న ఆదిరెడ్డి వీరరాఘువమ్మ


ఎన్నికల అధికారి మాధవీలతకు నామినేషన్ అందజేస్తున్న ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్

సత్యదేవుడి సన్నిధిలో

# పెళ్లిళ్ల సందడి

● సత్యదేవుడి సాక్షిగా ఒక్కటైన 200 జంటలు


వివాహబృందాలతో కోలాహలంగా మారిన ఆలయప్రాంగణం

అన్నవరం, ఏప్రిల్ 22: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి ఆదివారం రాత్రి వివాహబృందాలతో కోలాహలంగా మారింది. ఈసీజన్‌లో బలమైన ముహూర్తం కావడంతో సత్యదేవుడి సాక్షిగా 200 జంటలు ఒక్కటయ్యాయి. ఉచిత కల్యాణ మండపాలు, విష్ణుసదన్‌హాల్స్, సీతారామ, పాత, కొత్త సెంటినరీ కాటేజీలవద్ద రామాలయ ప్రాంగణంలో పెండ్లిబృందాలు వివాహాలు జరిపించుకున్నారు. వివాహ బృందాలకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఏర్పాట్లు చేశారు. సత్రంగదులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో స్వల్ప ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆదివారంరాత్రి సత్యదేవుడి సన్నిధిలో ఒక్కటైన జంటలతోపాటుగా రాష్ట్రం నలుమూలలా ఒక్కటైన నవదంపతులు సోమవారం ఉదయం సత్యదేవుడి వ్రతాలాచరించుకోవడంతో వ్రతమండపాలు కిక్కిరిశాయి. నూతన జంటలకు ఉచితంగా అంత్రాలయ ప్రదక్షిణ దర్శనం కల్పించాలని ఈవో ఆదేశాలతో నవదంపతులు అంత్రాలయ ప్రదక్షిణ చేసి మూలవరులను దర్శించుకున్నారు.

నేడు పిఠాపురంలో

## పవన్‌కల్యాణ్ నామినేషన్

పిఠాపురం, ఏప్రిల్ 22: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురం అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మంగళవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. మంగళవారం ఉదయం చేబ్రోలులోని నివాసం నుంచి బయలుదేరి గొల్లప్రోలు పట్టణ పరిధిలోని జాతీయ రహదారి వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి ర్యాలీగా గొల్లప్రోలు ఈబీసీ కాలనీ, మండలపరిషత్, తహసీల్దారు కార్యాలయాలు, బస్టాండు మీదుగా పిఠాపురం పట్టణంలోని ప్రవేశించి పశువుల సంత, ఆర్టీసీ కాంప్లెక్సు, చర్చి సెంటర్, ఉప్పాడ సెంటర్, పాతబస్టాండు, అంబేద్కర్ సెంటర్, ప్రభుత్వాసుపత్రి సెంటర్ మీదుగా పాదగయ క్షేత్రం వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి పిఠాపురం మండలపరిషత్ కార్యాలయానికి చేరుకుని రిటర్నింగ్ అధికారికి స్వయంగా నామినేషన్ పత్రాలు అందజేస్తారు.


ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేస్తున్న దేవదాయ కమిషనర్, ఈవో, చైర్మన్

# వైభవంగా సత్యదేవుడి ధ్వజస్తంభ ప్రతిష్ఠ

- నమూనాలయం వద్ద విగ్రహాలు కలశ ప్రతిష్ఠ
- విమాన గోపురం స్వర్ణమయానికి త్వరలో ఉత్తర్వులు

అన్నవరం, ఏప్రిల్ 22: అన్నవరం సత్యదేవుడి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. వేకువజాము నుంచి పండితులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. యాగశాలలో విశే షహోమాలు, మంత్రజపములు, కళాన్యాసము గావించి శయ్యాధివాసము నిర్వహించారు. అనంతరం ఉదయం 10.48కి దేవదాయ కమిషనర్ సత్యనారాయణ, దాత కుటుంబసభ్యులు, ప్రతిష్ఠ గావించారు. ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్‌లచే పండితులు పూజలు నిర్వహించారు. ఐదురోజులపాటు విశేష పూజలు అందుకున్న స్వర్ణ, రజత, కాంస్య, రాగి ధ్వజాలను ప్రతిష్ఠించి భక్తుల గోవిందనామస్మరణల నడుమ సుమారు 65 అడుగుల పొడవుగల ధ్వజస్తంభం ఏర్పాటుచేశారు. భక్తులు ధ్వజస్తంభ అడుగుభాగంలో పంచలోహాలు, నవధాన్యాలను వేయగా దేవదాయ కమిషనర్ పూర్వపు ధ్వజస్తంభ తొలగింపు సమయంలో అడుగుభాగంలో లభించిన పంచలోహాలను నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ సమయంలో వేశారు. చతుర్వేదపండితులు మహదాశీర్వచనం గావించారు. దేవస్థానం పీఆర్వో కృష్ణారావు, తదితరులు పాల్గొనగా వైదిక కార్యక్రమాలను గొల్లపల్లి సుబ్రహ్మణ్య ఘనాపాఠి, చామర్తి కన్నబాబు, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం నిర్వహించారు. ఈసందర్భంగా దేవదాయ కమిషనర్ మాట్లాడుతూ సువర్ణ ధ్వజస్తంభ ఏర్పాటు తన చేతుల మీదుగా జరగడం పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నానని ప్రతిపాదన దశలో ఉన్న విమానగోపురం స్వర్ణమయంపై త్వరలో ఉత్తర్వులు వెలువడతాయని అంచనా వ్యయం తి.తి.దే. చేపడుతుందని అంచనా వ్యయం వచ్చిన వెంటనే ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. ఈవో రామచంద్రమోహన్ హయంలో నాడు నూతన ఆలయ శిఖర ప్రతిష్ఠ నేడుబంగారు ధ్వజస్తంభ ప్రతిష్ఠ, త్వరలో విమానగోపురం స్వర్ణమయం కానుండడం ఆయనపై స్వామివారి ఆశీస్సులు మెండుగా ఉన్నాయన్నారు.

### జాతీయ రహదారివద్ద విగ్రహ ప్రతిష్ఠ

విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళ్లే జాతీయరహదారిపై సుమారు రూ.4కోట్లతో నిర్మించిన నమూనాలయం వద్ద విగ్రహప్రతిష్ఠా కార్యక్రమం వేడుకగా జరిగింది. రెండు ప్రతిష్ఠలు ఏకకాలంలో రావడంతో నమూనాలయంవద్ద రుత్విక్‌లు, విగ్రహాలను విరాళంగా అందించిన దాత చేతులమీదుగా కార్యక్రమం నిర్వహించారు. అనంత రం దేవదాయ కమిషనర్ సత్యనారాయణ, ఈవో, చైర్మన్‌లు టెంకాయి కొట్టి ప్రారంభించారు. ఈ ఆలయం వద్ద భక్తులు సేదతీరేందుకు, వాహనచోదకులకు అనువుగా ఉండే విధంగా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

# రాజప్ప భారీ ర్యాలీ

- టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి పెద్దాపురం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లిన ఉమ్మడి అభ్యర్థి చినరాజప్ప
- పెద్దాపురం కూటమి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు

సామర్లకోట, ఏప్రిల్ 22: పెద్దాపురం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా నిమ్మకాయల చినరాజప్ప సోమవారం నామినేషన్ నామినేషన్ దాఖలు చేసేందుకు చినరాజప్ప తన స్వగృహమైన అచ్చంపేటనుంచి పెద్దఎత్తున మోటార్‌సైకిళ్లపై కార్యకర్తలతో సామర్లకోట మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అగ్రబాగాన ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై రాజప్పతోపాటు జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, బీజేపీ ఇన్‌చార్జి విత్తనాల వెంకటరమణ, రాజాసూరిబాబురాజు నిలుచుని రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు తరలివెళ్లారు. మార్గపొడవునా ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు కూటమి పార్టీలకు చెందిన జెండాలు చేతబట్టి జేజే నినాదాలు చేస్తూ ముందుకు తరలివెళ్లారు. అచ్చంపేట, గొంచాల జంక్షన్, బ్రహ్మనందపురం, పి.వేమవరం జంక్షన్, ఉండూరు మీదుగా ర్యాలీ సామర్లకోటకు చేరుకుంది. సామర్లకోటనుంచి మరికొందరు నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా పెద్దాపురం తరలివెళ్లారు. ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, సామర్లకోట మండల, పట్టణ ప్రాంతాలకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన అధికసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.


నామినేషన్ వేసి బయటకు వస్తున్న రాజప్ప


టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తల ర్యాలీ

### మరింత జోష్

పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మూడోసారి నామినేషన్ దాఖలు చేసిన సోమవారం కూటమి పార్టీలలో మరింత జోష్ సంతరించుకుంది. మండుటెండను సైతం లెక్కించకుండా పెద్దాపురం నియోజకవర్గవ్యాప్తంగా అన్ని గ్రామాలనుంచి అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఆయా గ్రామాల్లో నిత్యం వైసీపీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన పార్టీలో చేరేందుకు క్యూ కడుతుండడంతో కూటమి పార్టీలకు మరింత జోష్ సంతరించుకుంది. నిత్యం ఇంటింటా నిర్వహిస్తున్న ప్రచారానికి ప్రజల నుంచి సానుకూల స్పందన లభిస్తుండడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం చేస్తుందో, ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చాక ఏమీ చేయలేకపోవడాన్ని బేరీజు వేస్తూ ప్రజలకు ప్రచారంలో వివరించడంతో ప్రజలనుంచి సానుకూలత సంతరించుకుంది.

# పది ఫలితాల్లో తిరుమల విజయభేరి



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 22 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడదల చేసిన పదో తరగతి ఫలితాలలో రాజమహేంద్రవరం తిరుమల ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. కె.రఘువీర్ 595 మార్కులు, కె.సుప్రియ 595 మార్కులు, ఏపీఆర్ సాయి శ్రీలత, బి.లలితారాణి, కె.సత్యభాస్కర్‌లు 594 మార్కులు, టి.ప్రీతి శరణ్య, ఎం.ఇబ్రహీంలు 593 మార్కులు, కె.అశ్రిత, ఎం.వీఎల్ వాత్సల్య, ఎం. గ్రీష్మశ్రీ, బి.యు.ప్రసాద్, పి.శ్రీతుల్య, జేవీఎస్ సత్య సాయిదత్త, వై.తేజశ్వీ, యస్.రంజిత్‌కుమార్‌లు 592 మార్కులు, వై.కృష్ణ చైతన్య, ఎల్.వైష్ణవి, సిహెచ్.లోక్‌ప్రకాష్, ఎస్‌వీఎస్ శ్రీధర్, డి.చిన్మయిలు 591 సాధించారని 590పైన 34 మంది, 580 పైన 223 మంది, 570పైన 451 మంది, 560 పైన 642 మంది, 550 పైన 779 మంది 500 పైన 1109 మంది విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సంస్థ డైరెక్టర్ నున్న సరోజినీ దేవి అకడమిక్ డైరెక్టర్లతో కలిసి అభినందించారు.

## శ్రీ ప్రకాష్ విద్యార్థుల విజయకేతనం


తనుశ్రీను అభినందిస్తున్న విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్

తునిరూరల్, ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్షల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు సంస్థ నిర్వాహకుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆడారి ధనుశ్రీ 600లకు 595, యల్లపు షణ్ముఖ ప్రియ 592, కుక్కయామిని జ్యోతిక 589మార్కులు సాధించి అగ్రగామిగా నిలిచారని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ప్రతి సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను చాటుతారని అదే ఆనవాయితీని ఈ ఏడాది కూడా కొనసాగించి నూటికి నూరుశాతం ఉత్తీర్ణత శాతం, మెరుగైన ఫలితాలు సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు విద్యాసంస్థల అధినేత సీహెచ్‌కేవీ నరసింహారావు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు, అధ్యాపకులకు

## ప్రయోజనకరంగా ఎంవోయు

● నన్నయ వీసీ ఆచార్య పద్మరాజు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 22 : విద్యార్థులకు, అధ్యాపకులకు ప్రయోజనకరంగా ఉండేలా ప్రముఖ సంస్థలతో ఎంవోయును కుదుర్చుకున్నట్లు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. నన్నయ వర్శిటీ 18వ వ్యవస్థాపక దినోత్సవం సోమవారం నిర్వహించారు. దీనికి వీసీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయం ఆవిర్భావానికి కృషి చేసిన మహనీయులను స్మరించుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా ఉన్నత విద్యలో ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషుమాధవ్ మాట్లాడుతూ యుజీసీ వికసిత భారత్ జాబితాలో నన్నయ వర్శిటీ ఉండటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డీన్ ఆచార్య పి.సురేష్ వర్మ, ఆచార్య కెఎస్ రమేష్, ఆదిత్య సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, వివిధ అనుబంధ కళాశాలలకు చెందిన యాజమాన్య ప్రతినిధులు హాజరై ప్రసంగించారు. తొలుత కానవరంలోని శ్రీరాపర్తి రామయోగా సంస్థ వారిచే యోగాసనాలను విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు వేశారు. సీఎస్ఐఆర్ జాతీయ ఫిజికల్ ల్యాబరేటరీ విశ్రాంత ప్రధాన శాస్త్రవేత్త జి.భగవాన్‌నారాయణ, రీసెర్చ్ మెథడాలజీ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


జ్యోతిప్రజ్వలన చేస్తున్న వీసీ పద్మరాజు



## వైసీపీ కార్యకర్తల అత్యుత్సాహం

- నిషేధిత ప్రాంతంలో డ్రోన్ ఎగురవేత
- అధికారులకు ఫిర్యాదు

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 22: కాకినాడ రూరల్ వైసీపీ అసెంబ్లీ అభ్యర్థిగా కురసాల కన్నబాబు నామినేషన్ సందర్భంగా వైసీపీ కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం సమీపంలో 100 మీటర్ల లోపు ఎన్నిక ప్రవర్తనా నియమావళి ప్రకారం నిషేధాజ్ఞలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో 144 సెక్షన్ అమల్లో ఉండడంతో ఇక్కడ ఏ ఉల్లంఘనలకు పాల్పడరాదని నిబంధనలు ఉన్నాయి. సోమవారం ఎమ్మెల్యే కన్నబాబు నామినేషన్ వేసేందుకు వచ్చిన సమయంలో డ్రోన్‌తో చిత్రీకరించేందుకు ఆకాశంలోకి డ్రోన్‌ని పార్టీ కార్యకర్తలు వదిలారు. కోడ్ అమల్లో ఉండడం, నిషేధిత ప్రాంతంలో డ్రోన్ వ దిలిన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి, కాకినాడ రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసినట్లు జనసేన రూరల్ అభ్యర్థి పంతం నానాజీ తెలిపారు.

### ప్రైవేట్ కళాశాల బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి

సామర్లకోట, ఏప్రిల్ 22: సామర్లకోట ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సూరంపాలెం ప్రైవేట్ కళాశాలకు చెందిన బస్సు ఢీకొనడంతో సామర్లకోట ప్రకాష్ నగర్‌కు చెందిన ఆలపు దుర్గ(60) తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ప్రమాదానికి కారణమైన ప్రైవేట్ కళాశాల బస్సు డ్రైవర్‌ను సామర్లకోట పోలీసులు అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించి కేసు నమోదు చేశారు.

## మహిళ మెడలో గొలుసు చోరీ

సామర్లకోట, ఏప్రిల్ 22: సామర్లకోట పట్టణ నడిబొడ్డునగల నీలమ్మచెరువు వాకింగ్‌ట్రాక్ వద్ద వాకింగ్ చేస్తున్న ఆకుల మాణిక్యం అనే మహిళ మెడలో ఆరు కాసుల బంగారపు గొలుసును గుర్తు తెలియని ఆగంతకుడు తెంపుకుని పరారయ్యాడు. ఈ సంఘటన సోమవారం చోటుచేసుకుంది. సామర్లకోట చౌడేశ్వరసమేత రామలింగేశ్వరస్వామి ఆలయం సమీపాన నివసిస్తున్న మాణిక్యం నీలమ్మ చెరువు వాకింగ్ ట్రాక్‌పై వాకింగ్ చేస్తుండగా గుర్తుతెలియని 30ఏళ్ల వయస్సుగల వ్యక్తి మెడలో బంగారపు గొలుసు తెంపుకుని పారిపోయాడు. చోరీకి గురైన బంగారపు గొలుసు విలువ రూ.3.21లక్షలు ఉంటుందని మహిళ సామర్లకోట పోలీసులకు అందించిన ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మీడియా సమాచార కేంద్రాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్ భావన

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 22: కాకినాడ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సాధారణ ఎన్నికల సమాచార కేంద్రాన్ని కాకినాడ జిల్లాకు నియమితులైన శిక్షణ కలెక్టర్ భావన సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీడియా సర్టిఫికేషన్, మోనటరింగ్ కమిటీ పనితీరు రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఇస్తున్న ప్రచారం అనుమతుల వివరాలను కేంద్రంలో ఏర్పాటు చేసిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల సమాచారాన్ని సమాచారశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సమాచారశాఖ డీడీ నాగార్జున, డివిజనల్ పీఆర్వో రవి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాబురావు పాల్గొన్నారు.

### టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి పార్లమెంట్ కన్వీనర్ నియామకం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 23: టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి పార్లమెంట్ కన్వీనర్‌లను పార్టీ అధినేత చంద్రబాబు నియమించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. టీడీపీ బ్రాహ్మణ సాధికార కాకినాడ పార్లమెంట్ కన్వీనర్‌గా కాకినాడ నగరానికి చెందిన హోతా రవి ప్రశాంత్ కుమార్‌ను నియమించారు.

## శృంగారవల్లభస్వామి ఆలయంలో రద్దీ

పెద్దాపురం, ఏప్రిల్ 20: మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,16,520 అన్నదాన విరాళాలు రూ.31,328, కేశఖండన ద్వారా రూ.9,040 తులాభారం రూ.500 వెరసి రూ.2,57,388 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 6వేలమంది భక్తులు స్వామిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## గంజాయి, డ్రగ్స్ రక్కసి కోరల్లో కాకినాడ

» ఇదంతా ఎమ్మెల్యే ద్వారంపూడి చలవే » పూర్వ స్మార్ట్‌సిటీ వైభవానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలి » ప్రజాగళం సభలో కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు


ప్రజాగళం సభలో మాట్లాడుతున్న కొండబాబు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 22: గంజాయి, డ్రగ్స్ రక్కసి కోరల్లో కాకినాడ నగరం కూరుకుపోయిందని, ఇదంతా ఎమ్మెల్యే ద్వారంపూడి చలవేనని కాకినాడ సిటీ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు ధ్వజమెత్తారు. రాబోయే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంలో కాకినాడను గంజాయి డ్రగ్స్ రహిత నగరంగా మార్చుకుని పూర్వ స్మార్ట్‌సిటీ వైభవాన్ని తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం సాయంత్రం స్థానిక 12వ డివిజన్ సంజయ్‌నగర్‌లో ప్రజాగళం సభ నిర్వహించారు. కాకినాడ లారీ యూనియన్ నాయకులు అల్లం రాజు, గంగాధర్ వారి అనుచరులు, సుమారు 200 కుటుంబాల వారు పెద్దఎత్తున టీడీపీలో చేరగా వారికి కొండబాబు పార్టీ కండు వాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వా నించారు. కొండబాబు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయంలో నగరాన్ని స్మార్ట్ సిటీ నగరంగా ఎంపిక చేసి అభివృద్ధి పరిస్తే, నేడు వైసీపీ పాలనలో అభివృద్ధిని విస్మరించి కాకినాడను గంజాయి, డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా అక్రమ సంపాదన కోసం గంజాయి, డ్రగ్స్‌కు బానిసలను చేసి యువత భవిష్యత్తును ఎమ్మెల్యే ద్వారంపూడి నాశనం చేశాడన్నారు. రాబోయే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంలో కాకినాడను అభివృద్ధి పథంలో నడిపించి, సంక్షేమ పథ కాలు అమలు చేస్తూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి అన్నివర్గాల ప్రజలను ఆదుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

### లారీ యూనియన్ సొమ్మును వాడేశారు..

లారీ యూనియన్ నాయకుడు అల్లం రాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే ద్వారంపూడి తన అనుచరులతో లారీ యూనియన్ సొమ్మును ఏటీఎం మిషన్ లాగ వాడేశారని మండిపడ్డారు. పార్టీ కార్యక్రమాలకు, సొంత కార్యక్రమాలకు తన అనుచరులతో లారీ యూనియన్ సొమ్మును దారి మళ్లించారన్నారు. నియోజకవర్గ అబ్జర్వర్ విసంశెట్టి లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకుడు గట్టి సత్యనారాయణ, మాజీ మేయర్ సుంకర పావని తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు సంగిశెట్టి అశోక్, సుంకర తిరుమలకుమార్, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, ఎలిపే శ్రీనివాస్, పెదిరెడ్ల నానాజీ, బాసి రమణారెడ్డి, దొరబాబు, పినపోతు రవి, గంగబాబు, గాది శివరామకృష్ణ, ఎరిపిల్లి రాము, చోడి పిల్లి సతీష్, మోసా పేతూరు, జారు, నిమ్మగడ్డ సతీష్, పలివెల బాబ్జి, తుమ్మల సునీత, కలగా సువర్ణ, తిరిది ఎల్లయమ్మ, జయమ్మకుమారి, రాజేశ్వరి, నిమ్మల అబ్బాయి, యాదవ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

### కూటమికి పట్టం కట్టాలి : హైపర్ ఆది

కాకినాడ సిటీ, ఏప్రిల్ 22: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు పట్టం కట్టాలని సినీనటుడు హైపర్ ఆది కాకినాడలో ప్రచారం నిర్వహించారు. తన పంచ్‌లతో ఓటర్లను ఆకర్షించారు. సోమవారం కాకినాడలోని 45, 46 డివిజన్‌ల్లో టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన కార్యకర్తలతో కలిసి ఆది ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక కొండయ్యపాలెంలోని శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో ముందుగా అమ్మవారికి పూజలు చేసి అక్కడి నుంచి ప్రచారం నిర్వహించారు. కాకినాడ సిటీ టీడీపీ అభ్యర్థి వనమాడి కొండబాబుకు సైకిల్ గుర్తుపైన, కాకినాడ పార్లమెంట్ జనసేన అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు గ్లాసు గుర్తుపైన ఓటు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు తోట సుధీర్, మొయ్యిల పార్థసారథి, తలాటం సత్య, మొయ్యిల సత్తిబాబు, తోట కుమార్, రామకృష్ణ, ఇంటి రాజేష్, బిరుద ప్రభావతి, సొల్లేటి నాగలక్ష్మి పాల్గొన్నారు.


కొండబాబును గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్న ఆది

## 'పది' ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

కరప, ఏప్రిల్ 22: పదోతరగతి పరీక్షా ఫలితాల్లో కరప మండల విద్యార్థులు సత్తా చాటారు. మండలంలోని తొమ్మిది జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలు, ఒక మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర పాఠశాల, రెండు ప్రైవేట్ స్కూళ్ల నుంచి 919మంది పది పరీక్షలు రాయగా వారిలో 883మంది ఉత్తీర్ణత సాధించారు. నడకుదురు విజ్ఞానజ్యోతి స్కూల్ విద్యార్థి జి.లక్ష్మిసిరి 586 మార్కులతో మండలం ఫస్ట్ సాధించింది. అదే పాఠశాలలోని జె.కమలాదేవి, కరప జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థిని బి.ఛరిష్మసాయిమహాలక్ష్మిలు 580 మార్కుల చొప్పున సాధించి మండలం రెండో స్థానంలో నిలిచారు. కరప, పెద్దాపురప్పాడు హైస్కూళ్ల విద్యార్థినులు డి.పూజ, టి.కళాతేజశ్వినిదేవిలు చెరో 579మార్కులు సాధించి మండలం మూడో స్థానం సాధించారు. పదోతరగతి మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను, కృషిచేసిన ఉపాధ్యాయులను ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి అభినందించారు.

**కోటనందూరు:** పదోతరగతి ఫలితాల్లో మండలంలో 82.42 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో అడిగర్ల శ్రీనివాస్ తెలిపారు. మండలంలో 421మంది పరీక్షలు రాయగా 347మంది ఉత్తీర్ణ సాధించారు. ప్రథమస్థానంలో శ్రీసాయి స్కూల్‌కు చెందిన అల్లం వినయ నందినీ 569మార్కులతో, అల్లిపూడి కస్తూరిబాగాంధీకి చెందిన జుత్తాడ తేజశ్రీకి 559 మార్కులతో ద్వితీయస్థానం, తాళపురెడ్డి అఖిల్ 558తో తృతీయస్థానంలో నిలవగా పలువురు అభినందించారు.

**గొల్లప్రోలు:** గొల్లప్రోలు పట్టణం, మండలంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు, అన్‌ఎయిడెడ్ పాఠశాలలో పరిధిలో పదోతరగతి పరీక్షల్లో 87.33శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. 908మంది విద్యార్థులకు 793మంది పాస్ అయ్యారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో గొల్లప్రోలు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి గోనెల షణ్ముఖేశ్వర్ 600కి 587మార్కులు సాధించి పట్టణం, మండలంలో ప్రథమస్థానం సాధించాడు. పలువురు అభినందించారు.

**సామర్లకోట:** సామర్లకోట మండలం, పట్టణవ్యాప్తంగా 1,095 మంది పరీక్షలకు హాజరుకాగా వారిలో 822 మంది ఉత్తీర్ణులు కావడం ద్వారా 75 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు సామర్లకోట ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య వెల్లడించారు. సామర్లకోటకు చెందిన పుప్పాల హరిణి(579), వేట్లపాలెనికి చెందిన కట్టా మౌనిక, సూరంపూడి విజయలు (578) మార్కులు సాధించారని తెలిపారు.

**జగ్గంపేట:** మండలం నుంచి 1221 మంది పరీక్షలు రాయగా 968 మంది ఉత్తీర్ణతయ్యారన్నారు. జగ్గంపేట గవర్నమెంట్ హైస్కూల్ నుంచి బి.జ్యోతిదేవి 592 మార్కులు ప్రథమస్థానంలో నిలవగా ఏపీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్ జి.యామిని 567మార్కులు, జిల్లా పరిషత్ కాండ్రేగుల నుంచిడి.మహేష్ 566తో తృతీయస్థానంలో నిలిచారు. మండలంలో 79శాతం ఉత్తీర్ణత శాతం వచ్చిందని ఎంఈవో కె. స్వామి తెలిపారు.

**తాళ్లరేవు:** మండలంలో 84.82శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో మోకా ఉమ తెలిపారు. 1,245మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1,056మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంజరం, చినబొడ్డువెంకటాయపాలెం జిల్లాపరిషత్ హైస్కూల్స్ విద్యార్థి బి.ఉష 583,ఐశ్వర్య 582 మార్కులు సాధించారు.

**కొత్తపల్లి:** పదో తరగతి ఫలితాల్లో యండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గ్రంధి వెంకట పవన్ 581సాధించి మండలంలో టాపర్‌గా నిలిచాడు. మండలంలో 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 902 మంది పరీక్షలకు హాజరుకాగా 677మంది పాసై 75 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో బుర్రా వేణుగోపాల్ తెలిపారు.

**గండేపల్లి:** మండలంలో 75శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో నాయక్ తెలలిపారు. 529 మంది పరీక్షలు రాయగా 401 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. మండలం మొదటి స్థానంలో గండేపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన వి. సత్యశ్రీ 577మార్కులు, రెండోస్థానంలో గండేపల్లి తక్షశిల స్కూల్ నుంచి ఎ.చందు 570, మూడోస్థానం సూర్యతేజ పబ్లిక్‌స్కూల్ నుంచి వైవీ సిద్దార్థ 568 మార్కులతో ఉన్నారు.

**ప్రత్తిపాడు:** మండలస్థాయిలో ఉత్తరకంచి ఆక్స్‌ఫర్డ్ విద్యార్థి కస్తూరి యషశ్రీ 591మార్కులతో ప్రథమ, ఒమ్మంగి భారతి విద్యాసంస్థలకు చెందిన శెట్టి నవ్యశ్రీ 590 మార్కులతో రెండో ర్యాంకు సాధించినట్లు ఎంఈవో వి.రాజబాబు చెప్పారు. మండలంలో 78శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు.

**సర్పవరం జంక్షన్:** కాకినాడ రూరల్ మండలంలో 1657 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1123 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో ఎల్.గణేష్‌బాబు తెలిపారు. కాకినాడ రూరల్ మండలం 67.77 ఉత్తీర్ణతా సాధించిందన్నారు. తూరంగిపేట హైస్కూల్‌కు చెందిన దాట్ల నాగసాయి అనుహ్య 584 మార్కులతో మండలంలో టాపర్‌గా నిలిచింది. ఏపీ ఎస్సీ హైస్కూల్ విద్యార్థిని జెపూజ భవాని 582 మార్కులతో ద్వితీయం, సర్పవరం హైస్కూల్‌కు చెందిన బల్ల వెంకట శివ సత్యశ్రీ 579 మార్కులతో తృతీయ స్థానాలు సాధించారు.

**ఏలేశ్వరం:** ఏలేశ్వరం రూరల్, పట్టణానికి చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో 78శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన ఎస్.కె.వహీద 584, జి.శ్రీలాస్య 578, సీ.క్రిష్ణ 575 మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతియ స్థానాల్లో ఉత్తీర్ణత సాధించారు.

**తొండంగి:** మండలంలో 76.5 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో షేక్ బాబ్జి తెలిపారు. 1044 మంది పరీక్షకు హాజరుకాగా వీరిలో 799 మంది ఉత్తీర్ణులై 76.5 శాతం సాధించారన్నారు. పైడి కొండ ఉన్నతా పాఠశాలకు చెందిన నర్సే కామేశ్వరి 577 మార్కులతో మండలస్థాయిలో టాపర్‌గా నిలచింది. బెండపూడి ఉన్నత పాఠశాలకు చెందిన డి.సత్యనాగు 576 మార్కులు, పి.దీపిక 575 మార్కులు సాధించగా ఎంఈవోలు షేక్‌బాబ్జి, అనిశెట్టి సుబ్బిరెడ్డి, బెండపూడి ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి అభినందించారు.

**పెద్దాపురం:** మండల పరిధిలోని కొండపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని వానపల్లి గౌరీ జ్యోతీ 584 మార్కులతో టాపర్‌గా నిలిచినట్లు ఎంఈవో ప్రభాకరశర్మ తెలిపారు. మండలంలో 1591 మంది పరీక్ష రాయగా 1226 మంది పాసవ్వడంతో 77.06 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు.

## బీసీల అభివృద్ధికి టీడీపీ పెద్దపీట

» ముమ్మిడివరం టీడీపీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు » ఇంజరంలో జయహో బీసీ కార్యక్రమం


ఇంజరంలో మాట్లాడుతున్న దాట్ల బుచ్చిబాబు

తాళ్లరేవు, ఏప్రిల్ 22: బీసీల అభివృద్ధికి టీడీపీ పెద్దపీట వేస్తుందని ముమ్మిడివరం టీడీపీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. సోమవారం ఇంజరం కల్యాణమండపంలో జయహోబీసీ కార్యక్రమం బీజీ సెల్ జిల్లా అధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు అధ్యక్షతన జరిగింది. దాట్ల మాట్లాడుతూ బీసీలకు రక్షణగా తెలుగుదేశం ప్రభుత్వ రక్షణ చట్టాన్ని తెస్తుందని, 50 ఏళ్లకే బీసీలకు పించన్ పథకం అందిస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీ, ఎస్సీలను మోసంచేసిందని సంక్షేమ పథకాలపేరిట కోట్లు దోచుకుందన్నారు. యస్సీ, బీసీ వర్గాలు మార్పు కోరుతూ టీడీపీకి ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీసీనేతలు టేకుమూడి లక్ష్మణరావు, కట్టా త్రిమూర్తులు, పొన్నమండ రామలక్ష్మి, వత్తుమిల్లి రామచంద్రరావు, మోపూరి శ్రీనివాసకిరణ్, వేగేశ్న భాస్కరరాజు, సాగి వెంకటసుబ్బరాజు, గుత్తుల సాయి, ఆకెల్ల నాగేశ్వరావు, జక్కల ప్రసాద్‌బాబు, మోర్త భైరవమూర్తి తదితరులున్నారు.

### టీడీపీలో చేరికలు

వైసీపీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ పాలనపై విసుగుచెంది కోరింగ పంచాయతీ చినబొడ్డువెంకటాయపాలెం మాజీ ఎంపీటీసీ వైదాడి శ్రీనివాసరావు, గ్రామపెద్దలు మరో 200మంది అగ్నికులక్షత్రియులు టీడీపీలో చేరారు. సోమవారం తాళ్లరేవు పార్టీ కార్యాలయంలో టీడీపీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు టీడీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎంపీటీసీ వైదాడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే పొన్నాడ చినబొడ్డువెంకటాయపాలెం గ్రామంలో ఎన్ని సమస్యలున్నా గాలికి వదిలేశారని, గ్రామానికి కూడా పెద్దలు కూడా లేకుండా చేశారన్నారు. ఆయన పాలనలో ఎంతో నష్టపోయాని చెప్పుకుంటే మా సామాజిక వర్గం పరువేపోతుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా అధికారంలో ఉన్నా టీడీపీతో ఏ ఎటువంటి ఇబ్బంది ఉండేదికాదని సొంతపార్టీ వైసీపీతో నాయకులతోనే చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. వైసీపీలో విసుగుచెందే ఉండలేక టీడీపీలో చేరామన్నారు. టీడీపీలో చేరినవారిలో గ్రామపెద్దలు చెక్కా కృష్ణ, పెసింగి ఈశ్వరరావు, పినపోతు శ్రీను, పంతాడి వెంకటేశులు, శేరు విష్ణు, పంతాడి ధర్మారావు, పంతాడి శంభర్ ఉన్నారు.

### అగ్నికుల క్షత్రియుల బైక్ ర్యాలీ

వైసీపీ పాలనపై విసుగుచెందిన కోరింగ పంచాయతీ చినబొడ్డువెంకటాయపాలెం అగ్నికులక్షత్రియులు టీడీపీకి మద్దతు పలుకుతూ సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. చినబొడ్డువెంకటాయపాలెంలో ర్యాలీ ప్రారంభించి గాడిమొగ, గోపాలపురం, బాబానగర్, పెదవలసల, లక్ష్మీపతిపురం, చినవలసల, తిమ్మరాజుపురం, బొడబొడ్డువెంకటాయపాలెం, తాళ్లరేవు, రచ్చవారిపేటల వరకు కొనసాగించారు. తాళ్లరేవు 216 జాతీయరహదారి పక్కన ఉన్న టీడీపీ కార్యాలయానికి చేరుకుంది. కార్యక్రమంలో అగ్నికులక్షత్రియులు పెమ్మాడి కృష్ణవేణి, వాడ్రేవు వీరబాబు, పెసింగి ఈశ్వరరావు, పొన్నమండ రామలక్ష్మి, కామాడి చినమాతరాజు, వనమాడి నూకరాజు, కామాడి మాతరాజు, పెదధర్మారావు, మల్లాడి పేర్రాజు, సీతారామరాజు, సంగాడి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


దాట్ల సమక్షంలో టీడీపీలో చేరుతున్న తోటపేట వైసీపీ కార్యకర్తలు

## 'సృజనాత్మకతను వెలికితీయాలి'


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

పోర్టుసిటీ (కాకినాడ), ఏప్రిల్ 22: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ప్రతినిధి, నటుడు, దర్శకుడు రికెన్ గోమెల్ అన్నారు. సోమవారం రాత్రి శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్ ఆధ్వర్యంలో ప్రముఖ నాటక రచయిత షేక్ స్పియర్ జయంతిని పురస్కరించుకుని దంటు కళాక్షేత్రంలో నిర్వహించిన గస్టో కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మరో అతిథిగా పాల్గొన్న ప్రము ఖ ఇంజనీర్ వైఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కళలపట్ల అభిరుచి కలిగి ఉండేలా పాఠశాల యాజమాన్యాలు దృష్టిసారించాలన్నారు. స్కూల్ డైరెక్టర్ చిట్టూరి విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో స్టేజ్ ఫియర్ పోగొట్టేందుకు, కళలలో మక్కువ పెంచేందుకు ప్రతిఏటా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తొలి రోజు దక్షిణాయిణం, డోరోమెన్స్ హబ్ రిటర్న్, ది బ్లూ అంబరిల్లా, మర్చంట్ ఆఫ్ వెన్నిస్ తదితర ప్రదర్శనలు జరిగాయి. కార్యక్రమంలో స్కూల్ సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, కోఆర్డినేటర్లు రాయ్, ప్రశాంతి, శ్రీహరి పాల్గొన్నారు.

## 'కూటమి అధికారంలోకి వస్తే మేలు'

కాకినాడ సిటీ, ఏప్రిల్ 22: తెలుగుదేశం కూటమిని అధికారంలోకి తీసుకువస్తే ప్రభుత్వ పెన్షన్‌దారులకు ఎంతో మేలు జరుగుతుందని, టీడీపీ గెలుపు ప్రభుత్వ పెన్షన్‌దారులకు అవసరమని ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ అసోసియేషన్ (అమరావతి) నేతలు పి.గురవయ్య, జి.పూర్ణచంద్రరావు, జి.విజ్‌డం చౌదరి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కూటమిని గెలిపించాలని కోరుతూ పది జిల్లాల్లో పర్యటనలు చేశామని వెల్లడించారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్‌లు సకాలంలో అందించలేకపోతోందన్నారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలు, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకోసం టీడీపీ కూటమిని గెలిపించాలని వారు కోరారు. అనంతరం చంద్రబాబు గెలుపు- పెన్షనర్ల పిలుపు పేరిట ముద్రించిన కరపత్రాన్ని గురవయ్యపూర్ణచంద్రరావు, విజ్‌డం చౌదరి ఆవిష్కరించారు.

## నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి సత్యప్రభ**


ప్రత్తిపాడులో మాట్లాడుతున్న సత్యప్రభ

ప్రత్తిపాడు, ఏప్రిల్ 22: ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్టీయే కూటమి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా మంగళవారం నామినేషన్ దాఖలు చేయనున్నామని ఈ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా కోరారు. సోమవారం సాయంత్రం పార్టీ కార్యాలయం వద్ద ఆమె విలేఖరులతో మాట్లాడారు. మంగళవారం ఉదయం 9గంటలకు పెదశంకర్లపూడి పార్టీ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని ఈ ర్యాలీ ఉత్తరకంచి, ఒమ్మంగి, శరభవరం, యుజేపురం, నెల్లిపూడి, కత్తిపూడి, ధర్మవరం మీదుగా ప్రత్తిపాడు తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేయనున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు దివంగత నేత వరుపుల రాజా అభిమానులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

### టీడీపీలో పలువురు చేరిక

**ఏలేశ్వరం:** మండలంలోని భద్రవరంలో టీడీపీ నాయకులు జిగటాపు సూరిబాబు, కొప్పుల బాబ్జి ఆధ్వర్యంలో వైస్ సర్పంచ్ వంగలపూడి లక్ష్మీపార్వతి, వంగలపూడి నాగబాబుతోపాటు సుమా రు 110మంది వైసీపీని వీడి టీడీపీలో చేరగా వారికి సత్యప్రభ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పెద్దనాపల్లిలో టీడీపీ నాయకులు సత్యప్రభకు మద్దతుగా ప్రచారం చేపట్టారు. మార్కండేయపురం టీడీపీ నాయకులు నీలి సూరిబాబు, వీరబాబు, నీలి నాగేశ్వరావు, లోవస్ లక్ష్మణరావు సత్యప్రభకు మద్దతు పలికారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జ్యోతుల పెతబాబు, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, అలమండ చలమయ్య, ఎం.నాగబాబు, పెండ్ర శ్రీను, పెంటకోట శ్రీధర్, బస్వా ప్రసాద్, పలివెల శీనివాస్, సుబ్బరాజు, నూకతాటి ఈశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

**రౌతులపూడి:** మండలంలోని డీజేపురంలో వైసీపీ కార్యకర్తలు గింజాల అప్పారావు, బట్టా లోవరాజుతో సహా 30 మంది వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో టీడీపీలో చేరగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వైసీపీ నాయకురాలు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ జిగిరెడ్డి రమణమ్మ, భర్త వైసీపీ మండల కన్వీ నర్ జిగిరెడ్డి శ్రీను శంఖవరంలో సత్యప్రభను మర్యాద పూర్వకంగా కలిశారు. చైర్మన్ తన అనుచరులు 100 మందికి వరకూ టీడీపీలో చేరనున్నారు.

## 'సత్యప్రభను గెలిపించుకుందాం'

ప్రత్తిపాడు, ఏప్రిల్ 22: నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజాను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని కూటమి నాయకులు అన్నారు. మండలంలోని ఒమ్మంగిలో 3 పార్టీల నాయకులు, కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, టీడీపీ నాయకుడు సత్యంశెట్టి సీతారాం, జనసేన నాయకుడు రామకుర్తి కామేష్ మాట్లాడుతూ సత్యప్రభ నామినేషన్ మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు దాఖలు చేయనున్న దృష్ట్యా నియోజకవర్గంలోని 3 పార్టీల క్యాడర్ పెద్దఎత్తున హాజరుకావాలన్నారు. బీజేపీ నాయకులు కర్రి ధర్మరాజు, ఉమ్మడి వెంకట్రావు, టీడీపీ నాయకుడు పట్టెం అప్పారావు పాల్గొన్నారు.

## ఘనంగా వనవిహార మహోత్సవం

అన్నవరం, ఏప్రిల్ 22: సత్యదేవుడి క్షేత్రపాలకులుగా పూజలందుకుంటున్న సీతారాముల దివ్యకల్యాణ మహోత్సవాలలో భాగంగా సోమవారం వినవిహార మహోత్సవం ఘనంగా జరిగింది. కొండపై నుంచి నవదంపతులైన సీతారాములను, పెండ్లి పెద్దలైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను మంగళవాయిద్యాల నడుమ కొండదిగువున సత్యదేవ ఉద్యానవనం వద్దకు తోడ్కొనివచ్చారు. ప్రత్యేక వేదికపై ఆశీను లు గావించి విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం వేదస్వస్తి జరిపి తిరిగి కొండపై రామాలయానికి నవదంపతులను తీసుకెళ్లారు.

## సింపోజియం పోస్టర్ ఆవిష్కరణ

జేఎన్టీయూకే, ఏప్రిల్ 22: యూసీఈకే, ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 26, 27న జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ఎస్పార్క్-2024 టెక్నికల్ సింపోజియం పోస్టర్‌ను ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ సింపోజియం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సాంకేతిక అంశాలపై పట్టు సాధించడం ప్రజంటేషన్ స్కిల్స్ పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ డైరెక్టర్ ఎస్.బాలాజీ, వైస్‌ప్రిన్సిపాల్ మీరా సాహెబ్, ఈసీఈ విభాగాధిపతి లీలాకుమారి పాల్గొన్నారు.

## 'జీతాలు చెల్లించడంలేదు'

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 22: తమకు 3 నెలలుగా జీతాలు చెల్లించడంలేదని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఒక వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ నివాస్‌కు కలెక్టరేట్‌లో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు నాగేశ్వరరావు, సుధీర్, చందు, శ్రీనివాస్ విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం మూడునెలలుగా జీతాలు చెల్లించకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు ఈశ్వర్‌రావు, ఏడుకొండలు, టీఏలు, ఏపీవోలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో మరింత బలంగా టీడీపీ

» జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ » చంద్రబాబు సమక్షంలో ప్రవీణ్‌కుమార్ రెడ్డి టీడీపీలో చేరిక


ప్రవీణ్‌కుమార్ రెడ్డి కుటుంబానికి టీడీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న చంద్రబాబు నాయుడు, జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, ఏప్రిల్ 22: గోవింద్ రెడ్డి జగ్గంపేట గ్రామ పంచాయతీకి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసి ప్రజలు మనస్సుల్లో ఉన్న వ్యక్తి అని, అటువంటి కుటుంబం టీడీపీలోకి రావడం వల్ల జగ్గంపేటలో టీడీపీ మరింత బలపడుతుందని జగ్గంపేట టీడీపీ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. జగ్గంపేట గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ దివంగత నేత తోలుగంటి గోవింద్ రెడ్డి కుమారుడు ప్రవీణ్ కుమార్ రెడ్డి, భార్య నాగ సాహితి, గోవిందరెడ్డిభార్య ఉదయభాస్కరి వైసీపీకి రాజీనామా చేసి టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు, జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా నెహ్రూ చంద్రబాబుతో మాట్లాడుతూ గోవింద్ రెడ్డి మన పార్టీలోకి రావడంతో టీడీపీ బలపడుతుందన్నారు. చంద్రబాబు ప్రవీణ్‌రెడ్డితో కష్టపడి పార్టీ కోసం పని చెయ్యండి, పార్టీలో తగిన గుర్తింపు ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జ్యోతుల నవీన్, జ్యోతుల లక్ష్మీదేవి, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, పాండ్రంగి రాంబాబు పాల్గొన్నారు.

### 'ఆపద్బాంధవుడు చంద్రబాబు'

రూ.6వేలు పెన్షన్ ఇచ్చి ఆదుకోనున్న దివ్యాంగులను ఆదుకోనున్న ఆపద్బాంధవుడు చంద్రబాబు అని జిల్లా టీడీపీ విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడు మండపాక అప్పన్నదొర అన్నారు. చంద్రబాబు ప్రజాగళం సభకు జగ్గంపేట విచ్చేసిన సందర్భంలో దివ్యాంగులు ఆయనకు స్వాగతం పలికారు. రాష్ట్ర దివ్యాంగుల నాయకులు గింజాల దుర్గాప్రసాద్ యాదవ్, గోకవరం మండల దివ్యాంగుల అధ్యక్షులు అడబాల సింగరయ్య, గునిపల్లి లచ్చన్న ఉన్నారు. రామవరం గ్రామం నుంచి రాష్ట్ర టీడీపీ యువత ఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నారా చంద్రబాబు జగ్గంపేటలో నిర్వహించిన ప్రజాగళం సభకు తీర్మాన్ డప్పుల చప్పుడుతో టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు, అభిమానులు 4కిలోమీటర్లు పాదయాత్ర చేసుకుంటూ హాజరయ్యారు. మహిళలందరూ చంద్రబాబుకి గుమ్మడికాయలతో దిష్టి తీసి నాలుగోసారి ముఖ్యమంత్రి కాబోయే చంద్రబాబు గారికి దిష్టి తగలకూడదన్నారు.

**కిర్లంపూడి:** జగ్గంపేటలో చంద్రబాబు సభకు టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు ఆధ్వర్యంలో వివిధ వాహనాల్లో కార్యకర్తలు వెళ్లారు. తూము కుమార్, కుర్ల చిన బాబు, గుడాల రాంబాబు, కాళ్ల వెంకటేష్ పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలు

**జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు**

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 22: ఎన్నికల అనంతరం ఏర్పడే కూటమి ప్రభుత్వంలో అభివృద్ధితో కూడిన సంక్షేమ పథకాలను అమలు చేస్తామని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పవన్ నివాసంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పిఠాపురం జీవన్‌నగర్‌కు చెందిన 80 మంది దళిత మహిళలు వీరమహిళా విభాగం ఉభయగోదావరి జిల్లాల కోఆర్డినేటర్ చల్లా లక్ష్మి ఆధ్వర్యంలో నాగబాబు సమక్షంలో జనసేనలో చేరారు. వారందరిని పార్టీలోకి నాగబాబు ఆహ్వానించారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంటా స్వరూపాదేవి, డీకే చైతన్య ఆదికేశవులు, ప్రియా సౌజన్య, కాట్నం విశాలి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### వర్చువల్ సమావేశం

ఎన్ఆర్ఐ జనసైనికులు, వీరమహిళలతో నాగబాబు సోమవారం పిఠాపురం నుంచి వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రవాసాంధ్రులు తప్పనిసరిగా స్వస్థలాలకు వచ్చి కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని ఆయన కోరారు.

## పవన్ నామినేషన్, బహిరంగసభను విజయవంతం చేయాలి : వర్మ

పిఠాపురం, ఏప్రిల్ 22: పిఠాపురం నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థి మంగళవారం జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ నామినేషన్ దాఖలు కార్యక్రమం, సాయంత్రం ఉప్పాడలో జరిగే బహిరంగసభలను విజయవంతం చేయాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ కోరారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం మత్స్యకార నాయకులతో సమావేశమయ్యారు. పవన్ నామినేషన్ కోసం గొల్లప్రోలులోని బైపాస్ వైజంక్షన్ ప్రారంభం వద్దకు నియోజకవర్గంలోని నాయకులంతా తరలివచ్చి ర్యాలీలో పాల్గొనాలని సూచించారు. 30వేల మందితో పవన్ నామినేషన్ దాఖలు చేస్తున్నారని తెలిపారు. ఉప్పాడలో సాయంత్రం జరిగే బహిరంగసభకు భారీగా తరలిరావాలని కోరారు. సమావేశంలో టీడీపీ నాయకుడు అనిశెట్టి సత్యానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'పవన్ నామినేషన్‌కు తరలిరావాలి'

జగ్గంపేట, ఏప్రిల్ 22: పిఠాపురంలో మంగళవారం జనసేన అధినేత ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నారని, జగ్గపేట నియోజకవర్గ జనసేన నాయకులంతా నామినేషన్ కార్యక్రమానికి హాజరుకావాలని జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ కోరారు. ఈ సందర్భంగా సోమవారం జగ్గంపేటలో జనసేన నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. బుదిరెడ్డి శ్రీనివాస్, పాలిశెట్టి సతీష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్తపల్లి నుంచి భారీ బైక్‌ర్యాలీ

కొత్తపల్లి, ఏప్రిల్ 22: పిఠాపురం నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పవన్ కళ్యాణ్ మంగళవారం నామినేషన్ కార్యక్రమానికి భారీ బైక్ ర్యాలీ నిర్వహించాలని ఉమ్మడి పార్టీ శ్రేణులు సోమవారం తీర్మానించాయి. ఈ మేరకు యండపల్లిలో జరిగిన సమావేశంలో మంగళవారం ఉదయం కొత్తపల్లి మండలం నుంచి 1500 బైక్‌లు, సుమారు 60 కార్లతో భారీర్యాలీగా పిఠాపురం తరలివెళ్లాలని తీర్మానించారు. సాయంత్రం ఉప్పాడ సెంటర్లో జరిగే బహిరంగ కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని కోరారు.

## జనసేనలో చేరిన కొమరగిరి సర్పంచ్



కొత్తపల్లి, ఏప్రిల్ 22: వైసీపీకి చెందిన కొమరగిరి సర్పంచ్ డాక్టర్ కండిపల్లి సత్యశ్రీ, ఆమె తండ్రి మాజీ ఎంపీటీసీ కండిపల్లి నూకరాజు జనసేన పార్టీలో చేరారు. వారికి సో మవారం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మేజర్ పంచాయతీకి చెందిన సర్పంచ్, మాజీ సర్పంచ్ వైసీపీని వీడి జనసేనలో చేరడంతో గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

## బీజేపీ జిల్లా ఉపాధ్యకుడిగా ఉమ్మిడి

ఏలేశ్వరం, ఏప్రిల్ 22: బీజేపీ కాకినాడ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉమ్మిడి వెంకట్రావును నియమిస్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామకుమార్ తెలిపారు. సోమవారం పట్టణ బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రామకుమార్ మాట్లాడుతూ వెంకట్రావును పార్టీ ఆదేశాల మేరకు జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తున్నామన్నారు. వెంకట్రావు మాట్లాడుతూ రామకుమార్, బీజేపీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైనిక్ సెల్ కన్వీనర్ కర్రి ధర్మరాజు, మండలాధ్యక్షులు కూరాకుల రాజా, టౌన్ ప్రధాన కార్యదర్శి గొల్లపూడి గణేష్, పోలబత్తుల పెదబాబు ఉన్నారు.

## టీడీపీ పరిశీలకుడిగా లక్ష్మీనారాయణ



ఉప్పలగుప్తం, ఏప్రిల్ 22: కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడిగా ఉప్పలగుప్తం మండలం భీమనపల్లికి చెందిన దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ నియమితులయ్యారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబును కలిసి నియోజకవర్గ పరిస్థితిని సమీక్షించారు.

## యనమల దివ్య ప్రత్యేక పూజలు

తొండంగి, ఏప్రిల్ 22: తుని టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా సోమవారం నామినేషను దాఖలు చేసిన యనమల దివ్య ముందుగా ఏవినగరంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు వెంకన్న బీఫాం స్వామి చెంత ఉంచి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యనమల నాగేశ్వర్రావు, యనమల రాజేష్, యనమల కృష్ణ, పిర్ల శివ తదితరులున్నారు.

**కోటనందూరు:** యనమల దివ్య నామినేషన్‌కు టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు, జనసేన మండలాధ్యక్షుడు పెదపాత్రుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలం నుంచి 5వేల మంది కార్యకర్తలు తుని వెళ్లారు. అంకంరెడ్డిరమేష్, పెంటకోట భాస్కరసత్యనారాయణ,షేక్‌నవాబ్‌జానీ ఉన్నారు.

## మల్లేపల్లిలో అన్నదానం

గండేపల్లి, ఏప్రిల్ 22: మల్లేపల్లి బీసీ కాలనీ రామాలయం వద్ద సోమవారం శ్రీరామనవమి పురస్కరించుకుని భారీ అన్నదానం నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. బుదిరెడ్డి శ్రీనివాస్ ఉన్నారు.

## లిబరేషన్ పార్టీ అభ్యర్థి నామినేషన్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 22: నియోజకవర్గ సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఏగుపాటి అర్జునరావు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను ఆర్వో ఎ.శ్రీనివాసరావుకు అందజేశారు. లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగతా బంగార్రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు రేచుకట్ల సింహాచలం, మానుకొండ లచ్చబాబు పాల్గొన్నారు.

## జైభీమ్ పార్టీ అభ్యర్థి నామినేషన్

పిఠాపురం, ఏప్రిల్ 22: పిఠాపురం నియోజకవర్గం నుంచి జైభీమ్‌రావ్ భారత్ పార్టీ అభ్యర్థిగా జగ్గారపు మల్లిఖార్జున నామినేషన్ దాఖలు చేశారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి నుంచి ర్యాలీగా పిఠాపురం తరలివచ్చి రిటర్నింగ్ అధికారి రామ్‌సుందర్ రెడ్డికి తన నామినేషన్ పత్రాలు అందజేశారు.